


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## సూక్ష్మ సేద్యంలో టాప్ ఏపీ

- రాష్ట్రంలో 1.26 లక్షల హెక్టార్ల పరిధిలో సూక్ష్మ సేద్యం
- అగ్రగామిగా నిలిపిన అధికారులకు సీఎం అభినందనలు

3



## వాళ్ల నాశనం చేశారు..

# మనం శాసనం చేశాం!

- దేశమంతా మద్దతిస్తే వైసీపీ ఒక్కటే వ్యతిరేకించింది
- పార్లమెంటులో చేసిన చట్టాన్ని గౌరవించరా?
- వైసీపీకి రాష్ట్ర ప్రజలు, వారి ప్రయోజనాలంటే లెక్కలేదు
- దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి
- ఇక అమరావతిని ఎవరూ మార్చలేరు, కదల్చలేరు
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు

2

"ఒక్క పార్టీ మినహా దేశంలోని పార్టీలన్నీ రాజధానికి అండగా నిలిచాయి. లోక్‌సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తూ 50 పార్టీలుంటే వాటిల్లో వైసీపీ మినహా అన్ని పార్టీలు అమరావతికి మద్దతిచ్చాయి. రాష్ట్రపతి ఆమోదం తర్వాత దీనికి పూర్తిస్థాయి చట్టబద్ధత వస్తుంది. అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ పార్లమెంటులో ఉండే అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు కృతజ్ఞతలు. రాజకీయ వైరుధ్యాలు, వ్యక్తిగతంగా భిన్నాభిప్రాయాలున్నా అన్ని పార్టీలు సహకారం ఇచ్చాయి. కొందరికి రాష్ట్రం గురించి తెలియదు. ఈ రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు. కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్టబద్ధత కల్పించే బిల్లుకు సహకరించాయి. అనుకూలంగా ఓటేశాయి. కానీ ఈ రాష్ట్రంలో ఓట్లు పొంది, ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు ఈ రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే... వైసీపీ మాత్రం మరోవైపు నిలిచింది. వైసీపీ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు సహకరిస్తాయి. కానీ రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో జగన్ సూచనల మేరకు వైసీపీ ఎంపీలు వ్యవహరించారు. వాళ్లు నాశనం కోరారు. మనం శాసనం చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు"

# ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నమిది



- 'చట్టబద్ధత' విజయాన్ని సంబరాలు చేసుకుంటున్నారు
- అధినేత సాధించిన విజయానికి అభినందనలు
- పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- 'జై అమరావతి' నినాదాలతో మార్మోగిన కేంద్ర కార్యాలయం

4



## మావిగన్ కాదు..

# మెంటల్ గన్

- ప్రాంతీయ విద్వేషి, కుల చిచ్చు కుట్ర దారు, సైకోకు రాజకీయాల్లో ఉండే అర్హతఉన్నదా?
- ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ ఐదు కోట్ల ప్రజల సంకల్పం
- ఊరంతా ఒక దారైతే ఉలిపి కట్టి అడ్డగోలు దారి అన్నట్లుగా సైకో
- దేశంలోని అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ప్రకటించాయి.
- పార్లమెంట్ అమరావతికి చట్టబద్ధత కల్పించింది.
- హైకోర్టు, సుప్రీంకోర్టు అమరావతి మార్పుకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చాయి.
- 151 ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే రాజధానిని ఎందుకు మార్చ లేకపోయాడు.
- పార్లమెంట్ చట్టబద్ధతతో అమరావతిలో పెట్టుబడులు మరిన్ని పెరుగుతాయి.
- అమరావతి మరో సైబరాబాద్‌గా మారి 175 నియోజకవర్గాలకు ఉద్యోగులు కల్పిస్తుంది.
- అమరావతి ద్వారా ప్రభుత్వానికి పెరిగే ఆదాయంతో పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు పెరుగుతాయి.
- పొరుగు రాష్ట్రాలకు ధీటైన ప్రపంచస్థాయి రాజధానితో ప్రతి తెలుగుబిడ్డ గర్విస్తారు.
- రుషి కొండపై రెండు అంతస్తుల నిర్మాణానికి చ.అడుగుకు రూ.26వేలు ఖర్చు చేసిన జగన్
- అమరావతిలో 40 అంతస్తుల ఐకానిక్ భవనాలకు చ.అడుగుకు రూ.6 వేలు ఖర్చు చేస్తున్న చంద్రన్న
- మెంటల్ గన్... గొడ్డలిపోటుగన్‌కు ప్రజలు అధికారం తిరిగి ఇవ్వరు గాక ఇవ్వరు
- తిరిగి కూటమి ప్రభుత్వాన్నే 2029లో ప్రజలు గెలిపిస్తారు.
- స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా ప్రతికుటుంబం తలసరి ఆదాయం రూ.55లక్షలకు పెంచుకుంటారు.

## ఇకనైనా..

# తీరు మార్చుకోండి

- ఇరిగేషన్ పనుల అంచనాల తయారీలో అలసత్వం తగదు
- ఆదివారంలోగా అంచనాలు సమర్పించండి...
- సీఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి నిమ్మల

7

## ఎన్‌హెచ్‌ల విస్తరణకు

# సహకరించండి

- 'మోర్త్' సెక్రటరీతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భేటీ
- ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై చర్చ
- ముఖ్యమైన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి
- అనుమతులు, సమస్యలపై సానుకూలంగా స్పందించిన కార్యదర్శి

5

## ప్రజా సమస్యల పరిష్కారమే

# కూటమి ప్రభుత్వ తక్షణ కర్తవ్యం

- గత ప్రభుత్వంలో సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దుస్థితి
- వైసీపీ పాలనా పాపాల కారణంగానే రెవెన్యూ సమస్యలు
- ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- మచిలీపట్నంలో ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి కొల్లు రవీంద్ర

7



# సీమ అభివృద్ధిపై ఎందుకింత విద్వేషం జగన్?

- రాయలసీమ లిఫ్ట్ పేరుతో వైసీపీ రోజుకో డ్రామా
- 2020లోనే రాయలసీమ లిఫ్ట్ పనుల్ని ఆపేసిన ఎన్జీటీ
- జగన్ దోపిడీకి అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 39మంది బలి
- ఒక్క జీఓతో 102 ప్రాజెక్టు పనుల్ని రద్దు చేసిన రాయలసీమ ద్రోహి జగన్
- 20 నెలల్లో రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం
- తాజా బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు రాయలసీమ అభివృద్ధికి కేటాయింపు

6

చైతన్యరథం

# దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి



- వైసీపీ నాశనం చేస్తే - మేం శాసనం చేశాం
- దేశమంతా మద్దతిస్తే వైసీపీ ఒక్కటే వ్యతిరేకించింది
- పార్లమెంటులో చేసిన చట్టాన్నీ గౌరవించరా?
- వైసీపీకి రాష్ట్ర ప్రజలు, వారి ప్రయోజనాలంటే లెక్కలేదు
- ఇక అమరావతిని ఎవరూ మార్చలేరు, కదల్చలేరు
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఏపీ రాజధాని అమరావతికి అండగా నిలిచాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో అన్ని రాజకీయ పార్టీలూ, ఎంపీలు అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లుపై మద్దతు పలికితే.. ఒక్క వైసీపీ ఎంపీలు మాత్రమే వ్యతిరేకించి వాకౌట్ చేశారని వ్యాఖ్యానించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం, రాజధాని ఏర్పాటు, అమరావతి ఎంపిక, వైసీపీ కుట్రలు, రాజధాని రైతుల ఉద్యమం, అసెంబ్లీ, మండలిలో జరిగిన పరిణామాలు, న్యాయ పోరాటం, రాజధాని పునర్నిర్మాణంవంటి అంశాలను సీఎం వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఒక్క పార్టీ మినహా దేశంలోని పార్టీలన్నీ రాజధానికి అండగా నిలిచాయి. లోక్‌సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తూ 50 పార్టీలుంటే వాటిల్లో వైసీపీ మినహా అన్ని పార్టీలు అమరావతికి మద్దతిచ్చాయి. రాష్ట్రపతి ఆమోదం తర్వాత దీనికి పూర్తిస్థాయి చట్టబద్ధత వస్తుంది. అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ పార్లమెంటులో ఉండే అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు కృతజ్ఞతలు. రాజకీయ వైరుధ్యాలు, వ్యక్తిగతంగా భిన్నాభిప్రాయాలున్నా అన్ని పార్టీలు సహకారం ఇచ్చాయి. కొందరికి రాష్ట్రం గురించి తెలియదు. ఈ రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు. కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్టబద్ధత కల్పించే బిల్లుకు సహకరించాయి. అనుకూలంగా ఓటేశాయి. కానీ ఈ రాష్ట్రంలో ఓట్లు పొంది, ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు ఈ రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే... వైసీపీ మాత్రం మరోవైపు నిలిచింది. వైసీపీ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు సహకరిస్తాయి. కానీ రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో జగన్ సూచనల మేరకు వైసీపీ ఎంపీలు వ్యవహరించారు. అమరావతి నాశనమై పోయినా పర్వాలేదనుకున్నారు. కానీ మనం దానిపై శాసనం చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజ ముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు."అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## ప్రతీ ఇటుకా పేర్చుకుంటూ వచ్చాం...

"విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. చాలా అంశాలకు పరిష్కారం చూపకుండానే విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే పోలవరం 7 ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ-గుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమన్నారు. ఆ సంకల్పంలో భాగమే ఉత్తరాంధ్ర-దక్షిణాంధ్ర, రాయలసీమల మధ్య సమాన దూరంలో ప్రాంతాన్ని ఎంపిక చేశాం. కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం. అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక, భూ సమీకరణ, సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశాం. సింగపూర్ ఒక్క పైసా తీసుకోకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చింది. పిలుపు ఇవ్వగానే 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలను ఇచ్చారు. ప్రభుత్వ భూమి కూడా కలిపితే 54 వేల ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధిలో రైతులను కూడా భాగస్వాములను చేసేలా వినూత్నమైన ల్యాండ్ పూలింగ్ స్కీమ్ తెచ్చాం. తమ భవిష్యత్తు బాగుంటుందని రైతులకూ విశ్వాసం కలిగింది. జరీబు భూములిచ్చిన వారికి 450 కమర్షియల్, 1000 గజాలు రెసిడెన్షియల్ రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చాం. ప్రతీ ఏటా యాన్యుటీ కూడా రైతులకు ఇస్తున్నాం. భూమి లేని రైతులకు కూడా పెన్షన్లు అదనంగా ఇస్తున్నాం. భూములు ఇచ్చిన వారంతా సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే ఇవన్నీ చేశాం. సిటీ రీజియన్ 56 మండలాలు, 8603 చదరపు కిలోమీటర్ల మేర, 117 చదరపు కిలోమీటర్ల క్యాపిటల్ సిటీని నిర్దేశించాం. సింగపూర్ మాస్టర్ ప్లాన్ తో నిర్మాణం ప్రారంభించేందుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశంలో ఉండే పవిత్రమైన దేవాలయాలు, ప్రార్థనా లయాల నుంచి మట్టిని, నదుల నుంచి నీటిని తెప్పించాం. ప్రధాని కూడా పార్లమెంటు నుంచి మట్టిని, యమునా జలాలను తీసుకువచ్చారు. పార్లమెంటు, యావత్ దేశం అంతా అండగా ఉంటుందనే ఆ మట్టిని, నీటిని తెచ్చినట్టు ప్రధాని చెప్పారు. 11 నెలల్లో సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించాం. 2016 జూన్ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అమరావతి నుంచే నిర్వహించాం. 9 నగరాలుగా అమరావతిని నిర్మించాలని ప్రణాళికలు చేశాం. నాలుగు ఆఫీసు భవనాలు నిర్మిస్తే రాజధాని అయిపోదు. భవిష్యత్ తరాలు శాశ్వతంగా రాజధాని ప్రాంతాన్ని వినియోగించుకోవాలి. ప్రపంచ శ్రేణి ఆర్కిటెక్టులను నియమించాం. నార్మన్ ఫోస్టర్స్ ద్వారా బ్లూ గ్రీన్ సిటీగా అమరావతిని అధునాతన నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేశాం. స్టాక్ ఎక్స్ఛేంజిలో అమరావతి బాండ్స్ విడుదల చేస్తే గంటలో రూ. 2 వేల కోట్లు వచ్చాయి. అంతటి క్రెడిబులిటిని అమరావతి నగరం సొంతం చేసుకుంది"అని సీఎం చంద్రబాబు వివరించారు.

## అమరావతి భవిష్యత్ నగరం

"భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొట్టతొలి రాష్ట్రానికి రాజధాని లేకుండాపోయింది. అందుకే ఈ తీర్మానం పెట్టి పార్లమెంటుకు పంపితే.. దానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. విద్య, ఉద్యోగం, విజ్ఞానంలాంటి అంశాలకు నెర్వ్ సెంటర్‌గా అమరావతి మారుతుంది. దేశానికి ఒక ఫ్యూచర్ సిటీ కూడా అవసరం. అదే అమరావతి. అమరావతి అభివృద్ధితోపాటు విశాఖ, తిరుపతిలాంటి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. రీజియన్లుగా ఆయా ప్రాంతాల్లో వేర్వేరు పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్‌లాంటి పరిశ్రమలు వస్తున్నాయి.

- (మిగతా వివరాలు 3లో)

## వైసీపీవి కుళ్లు... కుట్రలు.. కుతంత్రాలు

"రాజధాని విషయంలో వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అమరావతిని వ్యతిరేకించినా గత పాలకులు గతిలేని పరిస్థితిలో ఇక్కడినుంచే పాలన సాగించారు. వాళ్లు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. అమరావతికి అనుకూలంగా అడుగుపడిన సమయంలోనే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. అమరావతిపై వ్యతిరేకతతో ప్రపంచబ్యాంకుకు కూడా లేఖలు రాశారు. అరాచకం సృష్టించే ప్రయత్నించారు. అరటి తోటలు తగుల బెట్టారు. తప్పుడు రిపోర్టులు తెప్పించారు. ఎడారి, శ్మశానం అన్నారు. భూకంపాలు వస్తాయన్నారు. ఎన్ని విధాల రాజధానిని నష్టపరచాలో అంతా చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. సింగపూర్ దేశం పైనా అభాండాలు వేసి ఒప్పందాలు రద్దు చేశారు. అమరావతి బ్రాండ్ దెబ్బతీశారు. విట్,ఎస్ఆర్ఎం లాంటి ప్రతిష్టాత్మక వాటి పేర్ల చివరిలో అమరావతి క్యాంపస్ అని పెడితే దానిని తీసేయమని వారిపై ఒత్తిడి తెచ్చారు. 1,307 ఎకరాలను 113 సంస్థలకు రాజధానిలో భూములు కేటాయించాం. వేల మంది కార్మికులతో ముమ్మరంగా పనులు జరిగే సమయంలో వాటిని ఆపేశారు. మూడు రాజధానుల ప్రకటన చేసి.. మూడు ప్రాంతాల్లో వివాదం సృష్టించేలా ప్రయత్నించారు. హైకోర్టు కూడా దీనిపై వారికి మొట్టి కాయలు వేసింది. అమరావతి రైతుల ఉద్యమానికి కౌంటర్ గా పెయిడ్ ఆర్టిస్టులతో క్యాంపులు పెట్టించారు. ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు కేసులు పెట్టించారు. నాపై రాళ్లు వేయించారు. అదేమంటే భావప్రకటన స్వేచ్ఛ అని డీజీపీతో మాట్లాడించారు. పవన్ కల్యాణ్ వస్తే ముళ్లకంచెలు అడ్డంపెట్టారు. రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా? లేక ఏమనాలో తెలీటం లేదు. ఈ కుట్రలను కుతంత్రాలను ప్రజలు విశ్వసించలేదు. మాకు మళ్లీ ప్రజలు పట్టం కట్టారు" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



చైతన్యరథం

# సూక్ష్మ సేద్యంలో టాప్ ఏపీ

- **రాష్ట్రంలో 1.26 లక్షల హెక్టార్ల పరిధిలో సూక్ష్మ సేద్యం**
- **అగ్రగామిగా నిలిపిన అధికారులకు సీఎం అభినందనలు**



అమరావతి (చైతన్య రథం): మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమస్థానంలో నిలవడంపట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి, రికార్డుస్థాయిలో 1,26,057 హెక్టార్లను సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకువచ్చిన అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ తర్వాత 1.05 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ సాగుతో గుజరాత్ రెండో స్థానంలో ఉందన్నారు. ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు చేసిన కృషిని కొనియాడారు. ఈ పథకాన్ని వినియోగించుకుంటున్న 1,08,143 మంది రైతులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆధునిక సాగు పద్ధతుల ద్వారా వారికి నాణ్యమైన దిగుబడి, అధిక లాభాలు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ముఖ్యంగా డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను అవలంభిస్తున్న రైతులకు నీటి పొదుపుతోపాటు సాగు ఖర్చు తగ్గి, ఆర్థికంగా నిలదొక్కుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టమాటా, ఆయిల్ పామ్, మిర్చివంటి పంటల నుంచి పప్పు ధాన్యాల వరకు వైవిధ్యమైన పంటలు సాగు చేస్తున్న రైతాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా రూ.1030 కోట్లమేర సబ్సిడీని రైతులకు అందించామన్నారు. మైక్రో ఇరిగేషన్‌ను మరింత సమర్ధవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేస్తూ.. అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని వేల హెక్టార్లను సాగులోకి తెచ్చి, ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి

*(2వ పేజీ తరువాయి)*

సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి నీటి భద్రత తీసుకువస్తాం. ఒంటిమిట్టలో శ్రీరామ కల్యాణంలో పాల్గొన్నవేళ లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందింది. నిన్న రాజ్యసభలో బిల్లు పాస్ అయినవేళ పోలవరం డయాఫ్రామ్ వాల్ కూడా పూర్తి అయ్యింది. శుభపరిణామాలు వరుసగా జరుగుతున్నాయి. గత పాలకులు నిలిపిన అమరావతి నిర్మాణాల్ని మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ చేతుల మీదుగా పునర్నిర్మాణం మొదలు పెట్టాం. స్వాతంత్ర్య భారత దేశంలో మూడు రాజధానుల డ్రామా ఆడిన వ్యక్తులు ఎవరూ లేరు. అమరావతి దేశానికి ప్రైడ్‌గా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు గుండె, ఆత్మ ఇది. ఎవరు ఏమి చేసినా అమరావతి సంకల్పం ఆగదు. ప్రపంచ బ్యాంకు, హడ్కో, ఏడీబీ నుంచి ఫైనాన్షియల్ టైఅప్ ఉంది. ప్రస్తుతం రూ.56 వేల కోట్ల విలువైన పనులు రాజధానిలో జరుగుతున్నాయి. 2028 నాటికి రాజధానిలో ప్రధానమైన పనులన్నీ ఓ కొలిక్కి వస్తాయి. రాజధానికి లక్షల కోట్లు కావాలని కొందరు మాట్లాడుతున్నారు. కానీ నిర్మాణం ఒక్క రోజులో పూర్తి అయ్యేది కాదు. ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ ఇలాంటి వేర్వేరు ప్రాజెక్టులు నిర్మితం అవుతూనే ఉంటాయి. క్రమానుగుణంగా రాజధాని నిర్మాణం, అభివృద్ధి జరుగుతుంది. కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. హైదరాబాద్ ఒక్కటే తెలంగాణాలో గరిష్ట ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది. మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తి అయితే అభివృద్ధి ఆటో పైలట్ గా జరిగిపోతుంది. ప్రపంచంలోని వేర్వేరు ప్రాజెక్టులు ఈ మోడల్ లోనే అభివృద్ధి అయ్యాయి. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. దానికి చోదకశక్తిగా అమరావతి నిలుస్తుంది. 2029లో ప్రధాని మోదీతో ఈ ప్రాజెక్టులన్నీ ప్రారంభింపచేస్తాం. అమరావతి అజేయం, శాశ్వతం, అన్ స్టాపబుల్. దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయి. అమరావతి ప్రజా రాజధాని. రాష్ట్రంలోనూ, రాజధానిలోను ప్రజలు నిత్యం ఆనందంగా ఉండేలా చూడాలని నేను నిత్యం భగవంతుడిని వేడుకుంటూనే ఉంటాను” అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



## బుద్ధి మార్చుకోని వైసీపీ

“ప్రజలు, దేశం యావత్తూ అమరావతివైపుంటే... వైసీపీ నేతలు ఇంకా అహంకారం ప్రదర్శిస్తున్నారు. ఉభయ సభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందితే ఓర్వలేక పోతున్నారు. ఎక్కడ కూర్చొంటే అక్కడే రాజధాని ఏమిటి...? పార్లమెంటు ఓ చట్టం చేస్తే దానిని అమలు చేయాల్సిన రాజకీయ పార్టీలు నా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తా మంటే ఎలా...? ప్లాన్ ఏ, ప్లాన్ బీ అంటూ మాట్లాడటం ఏమిటి..? ప్లాన్ ఏలో మూడు ముక్కలాటలు, ప్లాన్ బీలో మావిగన్. ఇలాంటి విపరీత మనస్తతత్వం ఏమిటి..? దేశమంతా ఆంధ్రప్రదేశ్ కు మద్దతు పలికి అమరావతి నిర్మాణం కావాలని, దేశాభివృద్ధికి దోహదం చేయాలని సంఘీభావం తెలియచేశారు. వారందరినీ తప్పుపట్టేలా వైసీపీ వింత ప్రవర్తన ఉంది. ఇంత కుట్ర, విధ్వంసం చేసి మళ్లీ ఎదురు దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు జాతి చాలా సమస్యల్ని ఎదుర్కొంటూనే ఉంది. మొన్నటి వరకూ మనకు ఉనికి లేని పరిస్థితి. ఇప్పుడు మన వాళ్లే ఏపీకి ఉనికి లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. బెదిరింపులతో పెట్టుబడిదారులను తరిమి వేయటం నీచాతి నీచం. అప్రజాస్వామికంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠినంగా ముందుకు వెళ్తాం. చరిత్ర ఎప్పుడూ సానుకూల, వ్యతిరేక అంశాలను గుర్తుంచుకుంటూనే ఉంటుంది. అలాంటి వారిని చరిత్ర క్షమించదు. ఇలాంటి వ్యక్తుల విధానాల వల్ల ఏపీ అప్పుల్లో కూరుకుపోయింది. దక్షిణాదిలోనే తలసరి ఆదాయంలో అతితక్కువ స్థాయిలో ఉంది. తుగ్లక్ లు కొత్తగా పాలనలోకి వచ్చి రాజధానిని ప్రతీ సారీ మారుస్తామంటే ఎలా...? దీనికి అర్థం ఉంటుందా...? శాశ్వత రాజధాని అని పార్లమెంటు చట్టం చేస్తే దానిని కూడా మార్చేస్తామని మాట్లాడ తారా...? ఇదేం రాజకీయం...?ఇలాంటి నాయకులు ఉండటం రాష్ట్ర దౌర్భాగ్యం. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవహేళన చేసి మాట్లాడ తారా...? ప్రజలకు, ప్రజాధనానికి నష్టం జరిగేలా వ్యవహరిస్తారా...? ప్రజలకు సంక్షేమం, జీవన ప్రమాణాలను కల్పించటంపైనే ఎవరైనా మాట్లాడు కోవాలి. కానీ ఇలాంటి వారిపట్ల మాట్లాడటం కూడా అనవసరం” అని సీఎం అభిప్రాయపడ్డారు.



## కేంద్రం పూర్తిగా సహకరిస్తోంది.

“ప్రపంచం అంతా ఒకవైపు మాట్లాడితే... ఒక పార్టీ, వ్యక్తి మాత్రం వేరేవిధంగా మాట్లాడుతున్నారు. అమరావతి అని పలకటం కూడా వారికి ఇష్టం లేదు. అందుకే ఈ తరహాగా వ్యవహరిస్తున్నారు. శ్రీవేంకటేశ్వర స్వామికి ఘోర అపచారం చేసి సమర్థించుకున్న వాళ్ల ప్రవర్తనను ఇంకేం ఊహిస్తాం. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని అంతా కలిసి నిర్ణయిస్తే.. మళ్లీ ఆ చట్టాన్ని మార్చే ప్రయత్నం చేస్తారా...? అలాంటి అవకాశమే లేదు. గత పాలకులు 5 ఏళ్ల కాలంలో విభజన హామీల్లో ఒక్కటీ సాధించ లేకపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరానికి, అమరావతికి, విశాఖ స్టీల్ ప్లాంట్ కు, రైల్వే జోన్ కు, రాయలసీమ హార్టీ కల్చర్ హబ్ కు నిధులు సాధించగలిగాం. డబుల్ ఇంజన్ సర్కారుగా కేంద్రం, రాష్ట్రం కలసి పనిచేస్తున్నాం. ఏపీకి రావాల్సిన నిధులన్నీ వస్తూనే ఉన్నాయి. విభజన కంటే ఏపీకి జరిగిన నష్టం వైసీపీ హయాంలోనే ఎక్కువ జరిగింది. 30 ఏళ్లు వెనక్కివెళ్లాం. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిమరీ అప్పులు తెచ్చారు. మేం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకుని పాలన సాగిస్తున్నాం. ఎక్కువ వడ్డీలకు తెచ్చిన అప్పులను రీ షెడ్యూలు చేసుకుని భారం తగ్గించుకుంటున్నాం. ఒక వ్యక్తి వచ్చి పిచ్చి చేష్టలు చేసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు” అని ముఖ్యమంత్రి అన్నారు. అంతకుముందు పార్లమెంటు ఉభయ సభల్లోనూ అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందటంపై ముఖ్యమంత్రికి మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వారికి మిఠాయిలుపంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నమిది





- ‘చట్టబద్ధత’ విజయాన్ని సంబరాలు చేసుకుంటున్నారు
- అధినేత సాధించిన విజయానికి అభినందనలు
- పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- ‘జై అమరావతి’ నినాదాలతో మార్మోగిన కేంద్ర కార్యాలయం

మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో పార్టీ నాయకులు ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధమైన హోదాను సాధించినందుకు ముఖ్యమంత్రికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పార్టీ కార్యాలయం “జై అమరావతి” నినాదాలతో మారుమోగుతూ, ఉత్సాహభరితమైన, సంబరాల వాతావరణాన్ని ప్రతిబింబించింది. అదే ప్రాంగణంలో జరిగిన క్లస్టర్ ఇన్‌చార్జిల శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు.

సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఒక చారిత్రాత్మక మైలురాయి అని పల్లా అభివర్ణించారు. అమరావతి కేవలం ఒక పరిపాలనా రాజధాని మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి శక్తివంతమైన చిహ్నంగా పరిణామం చెందిందని పేర్కొన్నారు. సాధించిన విజయాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంతో పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. అమరావతికి చట్టబద్ధమైన గుర్తింపు లభించడంలోని భావోద్వేగాన్ని, ప్రజల సామూహిక ఆనందానికి ప్రతిబింబాన్ని తెలియజేస్తూ, ప్రతి ఇంట్లోనూ దీపాలు వెలిగిస్తున్నారన్నారు.

అమరావతిని శాశ్వత రాజధానిగా సాధించడం వెనుక ముఖ్యమంత్రి దూరదృష్టి, అపారమైన పరిపాలనా అనుభవం, అభివృద్ధిపట్ల అచంచలమైన నిబద్ధత ఉన్నాయని పల్లా పేర్కొన్నారు. క్లిష్టపరిస్థితులలోనూ నాయుడి నాయకత్వం స్థిరంగా నిలిచి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేసిందని నొక్కి చెప్పారు. ఈ నిర్ణయం దీర్ఘకాలిక దృష్టితో తీసుకున్నారని, ఇది భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ విజయం నిరంతర ప్రజా పోరాటం, రైతుల త్యాగాల ఫలితమని, ఇందులో వారి సహకారం కీలక పాత్ర పోషించిందని పల్లా అభినందనలు తెలిపారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నాలు ప్రశంసనీయమని, రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి పథానికి అనుగుణంగా ఉన్నాయన్నారు.

గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై తీవ్ర విమర్శలు చేస్తూ, మూడు రాజధానుల ప్రతిపాదన రాష్ట్రాన్ని అనిశ్చితిలోకి, పరిపాలనా గందరగోళంలోకి నెట్టిందని ఆరోపించారు. ఇటువంటి నిర్ణయాలు అభివృద్ధికి ఆటంకం కలిగించి, ప్రజలలో సందిగ్ధతను పెంచాయన్నారు. అమరావతి ఇప్పుడు ఏకైక రాజధానిగా పటిష్టంగా స్థిరపడటంతో, మిగిలివున్న అన్ని సందేహాలకు తెరపడిందని పల్లా స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిపై ఊహాజనిత లేదా పరస్పర విరుద్ధమైన ప్రకటనల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించేది లేదని పల్లా హెచ్చరించారు. రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగించే రాజకీయ విధానాలను ప్రజలు నిశ్చయంగా తిరస్కరిస్తారని స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దడంలో దృఢనిశ్చయంతో ఉందని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా స్పష్టం చేశారు. ఈ అభివృద్ధిని రాష్ట్ర వృద్ధిపథంలో ఒక కీలకమైన మైలురాయిగా ఆయన అభివర్ణించారు.









# ఎన్‌హెచ్‌ల విస్తరణకు సహకరించండి

- 'మోర్త్' సెక్రటరీతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భేటీ
- ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై చర్చ
- ముఖ్యమైన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి
- అనుమతులు, సమస్యలపై సానుకూలంగా స్పందించిన కార్యదర్శి

న్యూఢిల్లీ (చైతన్యరథం): కేంద్రంలోని మోడీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం -రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సమన్వయంతో ఏపీలో ఎన్‌హెచ్ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఏపీలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల మంజూరు, విస్తరణ పనుల అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కేంద్ర రోడ్డు, రవాణా మరియు హైవే శాఖ సెక్రెటరీ ఉమాశంకర్‌ను కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. నేడు ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా మరియు హైవే శాఖ కార్యాలయంలో ఆ శాఖ సెక్రెటరీ ఉమాశంకర్, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎంటి కృష్ణబాబుతో కలిసి సమావేశమయ్యారు. అనంతరం ఆయనకు తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసి రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు, పెండింగ్ సమస్యల పరిష్కారంవంటి అంశాలపై మోర్త్ సెక్రటరీతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చర్చించారు. ఏపీలో జాతీయ రహదారుల అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని మంత్రి కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఒక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి జాతీయ రహదారుల పనుల పెండింగ్ సమస్యలైన భూసేకరణ, అటవీ క్లియరెన్స్, రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తూ జాతీయ ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తున్నామని తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో 2 లేన్ల రహదారిని రూ.60 కోట్లతో 4 లేన్లగా మార్చే ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.. నూతన ప్రతిపాదనలకు అనుమతులు, పెండింగ్ సమస్యల పరిష్కారంపై మోర్త్ సెక్రటరీ సానుకూలంగా స్పందించడం జరిగింది. అదే సమయంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన జాతీయ రహదారి ప్రాజెక్టుల మంజూరు, అమలును వేగవంతం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



**మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మోర్త్ సెక్రటరీ దృష్టికి తెచ్చిన ప్రధాన ప్రాజెక్టులు :**

- ఎన్‌హెచ్-165లో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు ఫోర్-లేనింగ్ పనులు
- ఎన్‌హెచ్-216లో కిమీ 32నుండి అమలాపురం - రావులపాలెం వరకు ఫోర్ లేనింగ్ పనులు
- ఎన్‌హెచ్-216ఏలో పెదన నుండి లక్ష్మీపురం వరకు అభివృద్ధి పనులు
- ఎన్‌హెచ్-365బీబీలో కిమీ 26నుండి 45 వరకు పేవ్డ్ షోల్డర్లతో టూ-లేన్‌గా అభివృద్ధి
- ఎన్‌హెచ్-42లో ముదిగుబ్బ నుండి కదిరి వరకు ఫోర్-లేనింగ్ పనులు
- ఎన్‌హెచ్-716లో ముద్దనూరు నుండి కడప వరకు ఫోర్-లేనింగ్ పనులు
- ఎన్‌హెచ్-40లో కడప -రాయచోటి విభాగంలో ఫోర్-లేన్ టన్నెల్ నిర్మాణం
- ఎన్‌హెచ్-40లో చిత్తూరు పట్టణ పరిధిలో బైపాస్ రహదారి అభివృద్ధి
- ఎన్‌హెచ్-544డిలో బుగ్గ నుండి క్రైప వరకు రహదారి అభివృద్ధి /అప్‌గ్రేడేషన్ పనులు
- ఎన్‌హెచ్-167కెలో నల్లకాలువ నుండి వెలుగోడు వరకు అప్‌గ్రేడేషన్ పనులు మరియు మొదలైన పనులు.

ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతోపాటు, ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రాంతీయ అభివృద్ధి దోహదపడుతుందని మంత్రి తెలిపారు. అదేవిధంగా, ఈ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, మోర్త్ ప్రాంతీయ అధికారి హరికృష్ణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నోరుందని అడ్డగోలుగా
# వాగితే తాట వలిచేస్తాం

- అక్రమాలపై చర్యలు తీసుకుంటే అధికారుల్ని బెదిరిస్తావా?
- కులాలు, మతాల పేరుతో కుట్రలు చేస్తే సహించేది లేదు
- పేర్ని నానికి మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్



మచిలీపట్నం (చైతన్య రథం): మచిలీపట్నంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు తొలగిస్తే పేర్ని నాని ఎందుకు అంత రాద్ధాంతం చేస్తున్నాడో సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. "అక్రమ కట్టడాలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు వ్యవహరించిన వైఖరి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నిర్మాణాలు చేపట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ముందు, పెద్దల సమక్షంలో కట్టడాలు చేయమని హామీ ఇచ్చి, రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులు చూస్తూ ఊరుకుంటారా? నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్న కమిషనర్, ఎస్పీ, సీఐవంటి అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. అధికారులు తమ విధులు నిర్వహిస్తుంటే నీకెందుకు అంత నొప్పి" అని నిలదీశారు. "వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చిలకలపూడి ప్రాంతంలో పేదల ఇళ్లు కూల్చివేసిన ఘటనలో కూడా నాని పాత్ర ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 130 అడుగుల రోడ్డు పేరుతో యాదవ సోదరుల ఇళ్లను కూల్చివేయాలని ప్రయత్నించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని హెచ్చరించారు. గాంధీ బట్టల దుకాణం విషయంలో జరిగిన ఘటనలో ఆయన మానసికంగా ఇబ్బంది పడటానికి కారణం పేర్ని నాని కాదా? పేర్ని నానిలాంటి వ్యక్తిని కన్నందుకు వారి తల్లిదండ్రుల ఆత్మ క్షోభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రికి ఒక్కరోజైనా అన్నం పెట్టావా? అని మంత్రి నిలదీశారు.

గత 5 సంవత్సరాలుగా రామ్ నిటీష్ మాల్ నిర్మాణాన్ని అడ్డుకున్న విషయం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బైపాస్ రోడ్ విషయంలోనూ అనేక వివాదాలు తలెత్తాయి. ఎన్ని పాపాలు చేశావు నాని... నువ్వు అసలు మనిషివేనా అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వానికి కులాల మతాలు లేవు. ప్రజల కోసమే పని చేస్తున్నామని మంత్రి కొల్లు స్పష్టం చేశారు. మీ మున్సిపల్ పదవీకాలం ముగిసిన తర్వాతే భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనం నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. వంగవీటి రంగా హత్యలో సంబంధం ఉన్న వ్యక్తులను ఇంటికి పిలిచి విందులు పెట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మేము ఎప్పుడూ ధర్మం పక్షాన నిలబడతాము. ఇప్పటికే 2600 జిఓ3 ఇళ్లు నిర్మించి అర్హులైన వారికి అందించామని తెలిపారు. ఇళ్ల పంపిణీ విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నాం.. డ్రైనేజీ వ్యవస్థను ఫేజ్ వైజ్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పేర్ని నాని అర్ధరాత్రి సమయంలో దొంగ పట్టాలు ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారులను బలిచేసింది పేర్ని నాని అని విమర్శించారు. ధర్మం ప్రకారం ముందుకు సాగుతామని, ఎవరైనా నష్టపోతే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అధికారులు వారి విధులు నిర్వహించకోవాలని, బాధ్యత గల రాజకీయ నాయకుడిలా ప్రవర్తించాలని హెచ్చరిస్తూ, ఇకపై అధికారులు కాలర్ ఎత్తుకుని పనిచేసేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

## రబీ ధాన్యం సేకరణకు సర్వం సిద్ధం..

- 23 లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వ లక్ష్యం
- మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్
- నేటినుంచే రబీ ధాన్యం సేకరణ ప్రారంభిస్తున్నామని వెల్లడి



నిడదవోలు (చైతన్య రథం): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రబీ ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సంయుక్తంగా ప్రకటించారు. శుక్రవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌ను కూటమి ప్రభుత్వం అత్యంత విజయవంతంగా ముగించిందని మంత్రులు తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లావంటి ప్రాంతాల్లో సాగు ఆలస్యమైనప్పటికీ, అక్కడ రికార్డుస్థాయిలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించబోతున్నామని వెల్లడించారు. ఇదే ఉత్సాహంతో రబీ సీజన్‌లోనూ అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రేపటి నుండే ధాన్యం సేకరణ ప్రారంభించబోతున్నామన్నారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా పనిచేస్తున్నామన్నారు.

**రైతు పక్షపాతి ప్రభుత్వం - గత గణాంకాలతో పోలిక**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022-23లో 14.12 లక్షలు, 2023-24లో కేవలం 12.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారని.. కానీ కూటమి ప్రభుత్వం గత రబీలో 22 లక్షల లక్ష్యానికి గానూ 19.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రికార్డు సృష్టించిందని గుర్తు చేశారు. 2.01 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 4,575 కోట్లు కేవలం 48 గంటల్లోనే జమ చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. ఖరీఫ్ సీజన్ లో కూటమి ప్రభుత్వం 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఈ ఏడాది 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేపట్టి రూ.11,300 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో కేవలం 24 గంటల్లోనే జమ చేశామని గుర్తుచేశారు.అందులో సుమారు రూ.7300 కోట్ల రూపాయలు కేవలం 8 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతులు హర్షించడం తమకు సంతోషం కలిగించిందన్నారు.

**రబీ సేకరణకు పక్కా ప్రణాళిక:**

ఈ రబీలో 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,917 సేకరణ కేంద్రాలు ఈ వారంలోనే అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. రైతుల కోసం 5.40 కోట్ల గన్నీ బ్యాగులు, రవాణాకు 17,262 వాహనాలను సిద్ధం చేశామని ప్రకటించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా కల్లాల వద్దే, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గోదాలు అందిస్తామన్నారు. 24 గంటల్లోనే డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 2,411 రైస్ మిల్లులు బ్యాంకు గ్యారంటీలు సమర్పించాయని వివరించారు.

# సీమ అభివృద్ధిపై ఎందుకింత విద్వేషం జగన్?

- రాయలసీమ లిఫ్ట్ పేరుతో వైసీపీ రోజుకో డ్రామా
- 2020లోనే రాయలసీమ లిఫ్ట్ పనుల్ని ఆపేసిన ఎన్జీటీ
- జగన్ దోపిడీకి అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 39మంది బలి
- ఒక్క జీఓతో 102 ప్రాజెక్టు పనుల్ని రద్దు చేసిన రాయలసీమ ద్రోహి జగన్
- 20 నెలల్లో రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం
- తాజా బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు రాయలసీమ అభివృద్ధికి కేటాయింపు

వైసీపీ దొంగల ముఠా రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో రోజుకో నాటకం ఆడుతోంది. సీమ నాయకులు వారానికి ఒకరోజు రాయలసీమ లిఫ్ట్‌పై చేస్తున్న గోల "సింగినాదం జీలకర్ర"లాగా ఉంది. రాయలసీమకు తమ పాలనలో ఏం వెలగబెట్టారో, ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు చేశారో కూడా చెప్పుకోలేని స్థితిలో వాళ్ల మాటలున్నాయి. సీమ రైతుల కోసం ఈ ప్రాజెక్టు పూర్తి చేశామని ప్రజలకు వివరించే దమ్ము కూడా వాళ్లకి లేదు. జగన్ హయాంలోనే 2020లో రాయలసీమ లిఫ్ట్ పనులు ఆగిపోతే... ఇప్పుడు వీధుల్లోకి వచ్చి తమ పాలనలో ఏమీ చేయలేదు, ఇప్పుడు తప్పుడు ప్రచారం ద్వారా గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రాయలసీమ ఎండలకు, కరువులకు ప్రతీకగా నిలిచిన ప్రాంతం. సాగునీరు అందించడం ఒక పెద్ద సవాలు. అటువంటి పరిస్థితుల్లో రాయలసీమకు నీటి భరోసా కల్పించేందుకు తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన ప్రాజెక్టుల నిర్మాణం సీమ భవిష్యత్తును మార్చేసింది. నేడు రాయలసీమలో అభివృద్ధి, సాగునీటి నిర్వహణ, పారిశ్రామిక ప్రగతి వంటి అంశాల గురించి ప్రస్తావిస్తే అన్న ఎన్టీఆర్, చంద్రబాబు గార్ల పేర్లే గుర్తుకువస్తాయి. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, కేసీ కెనాల్‌వంటి పథకాలు ఈ ప్రాంత రైతుల జీవితాలనే మార్చేశాయి. సీమ ప్రజలకు ఈ ప్రాజెక్టులు జీవనాడిగా నిలిచాయి.

### రాయలసీమ ప్రాజెక్టులకు రూ.30 వేల కోట్లు ఖర్చు:

వెనకబడిన రాయలసీమ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. 2014-19 మధ్య కాలంలో రూ.12,441 కోట్లు ఖర్చు చేసిన చంద్రబాబు ప్రభుత్వం... 2024-26లో రూ.8,018 కోట్లుఖర్చు చేసింది. తాజాగా బడ్జెట్‌లో 2026-27 లో రూ.10,014 కోట్లు సీమ ప్రాజెక్టులకు కేటాయింపులు చేసింది. జగన్ తన ఐదేళ్ల పాలనలో రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తే... చంద్రబాబు ప్రభుత్వం ఏడేళ్ల పాలనలో రూ.20,459 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.10,014 కోట్లు ఖర్చు చేయబోతోంది. మొత్తంగా వేల కోట్లు రూ.30,473కోట్లు సీమ ప్రాజెక్టులకు చంద్రబాబు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దేలా సీఎం చంద్రబాబు గారు కృషి చేస్తున్నారు.

### ప్రాజెక్టుల మరమ్మతులకు వేగంగా నిధులు:

తుంగభద్ర క్రాష్ ప్రోగ్రామ్ లాగా పనులు చేసి కేవలం 5 రోజుల్లో గేట్లను మరమత్తు చేయించారు. దాదాపు ఈ చర్య ద్వారా సుమారు 30 టీఎంసీల నీటిని కాపాడాం. తుంగభద్ర ప్రెస్ట్ గేట్ల రిమోట్ కంట్రోల్ సిస్టమ్ పనులు రూ.54,42 కోట్లు ఇచ్చాం. శ్రీశైలం, గోరుకల్లు, అలగనూరు, వంటి ఇతర ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.610 కోట్లు ఖర్చు చేసి పనులు చేయిస్తున్నాం. శరవేగంగా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి సీమ రైతాంగానికి సాగునీటిని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది.

### రికార్డులు సృష్టించిన హంద్రీనీవా నీటి తరలింపు:

కూటమి ప్రభుత్వ కృషి ఫలితంగా రాయలసీమ ప్రాంతంలో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రికార్డ్ టైంలో 52.023 టీఎంసీల నీటిని తరలించి ఘనత సాధించాం. 2014-19 లో రూ.4,182 కోట్లు ఖర్చు చేసిన చంద్రన్న... 2024-26లో రూ.3,870 కోట్లు ఖర్చు చేసి 2 వేల క్యూసెక్కుల సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి పెంచారు. 738 కి.మీ. దూరంలో ఉన్న కుప్పానికి నీటిని అందజేశాం. ఇప్పటివరకు 250 రోజుల్ల 52 టీఎంసీల నీటిని తరలించారు. ఒక సీజన్ లో ఇంత తక్కువ సమయంలో 52 టీఎంసీలకు పైగా నీటిని ఎత్తి పోసిన దాఖలాలు లేవు. తాజాగా హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశ పనులకు చంద్రబాబు



ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో నాబార్డు/ఆర్ఐడీఎఫ్ కిందరూ. 1,184.50 కోట్లతోఐదు పనులు చేపట్టనున్నారు.

### సీమ ద్రోహులు... తండ్రీకొడుకులు:

కృష్ణా నదిలో మిగులు జలాలు కోరబోమని వైఎస్ఆర్ బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కు లేఖ రాసి రాయలసీమ రైతుల గొంతు కోస్తే... అప్పర్ భద్ర నిర్మిస్తున్నా జగన్ పట్టించుకోలేదు. కృష్ణా బిలాల్లో 512 టీఎంసీల నీటిని కేసీఆర్ తో ఒప్పించి సంతకం చేయించి చంద్రబాబు సాధిస్తే... సెక్షన్ 3పై చర్చించేలా జగన్ రెడ్డి ఆపిక్స్ కౌన్సిల్ లో వాదనలు వినిపించకుండా రాయలసీమకు ద్రోహం చేశాడు. నేడు తెలంగాణ ప్రభుత్వం నీటి కేటాయింపులపై డిమాండ్ చేస్తుందంటే జగన్ నిర్లక్ష్యపు దోరణే కారణం. అలగనూరు బ్యాకేజీ జిలాశయం గట్టు క్రిందికి కుంగి పోయింది. సెప్టెంబర్ 2021 నుండి నీటి విడుదల ఆపేశారు. గాలేరు-నగరి ప్రాజెక్టుకు కీలకమైన గోరుకల్లు జలాశయం నిర్వహణ పట్టించుకోలేదు. అవుకు జలాశయం నిర్వహణను గాలికొదిలేశారు. ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు ఇవ్వకపోవడంతో తుంగభద్ర డ్యామ్ 19వ క్రస్ట్ గేట్ తెగిపోయి వేల క్యూసెక్కులు వృథాగా పోయాయి. శ్రీశైలం పంజ్ పూల్ ను పట్టించుకోలేదు. 2014-19 మధ్య కాలంలో గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, కేసీ కెనాల్, తుంగభద్ర ఎల్ఎల్సీ, హెచ్ఎల్సీ, వెలుగోడు రిజర్వాయర్, గోరుకల్లు, అలగనూరు, గండికోట రిజర్వాయర్, సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్ఆర్బీసీ, పుంగనూరు బ్రాంచ్ కెనాల్, ఇలా రాయలసీమకు సంబంధించిన అనేక ప్రాజెక్టులకు చెందిన 102 పనులు చంద్రబాబు హయాంలో ప్రారంభించారు. రాయలసీమ బిడ్డ అని చెప్పుకునే జగన్ రెడ్డి... 2019 లో అధికారంలోకి వచ్చిక ఏడాదిలోపే జీఓ 365 తెచ్చి ఈ 102 ప్రాజెక్టులకు సంబంధించిన పనులను ప్రీ క్లోజ్ చేశాడు. రాయలసీమ రైతాంగానికి ఎంతో ఉపయోగకరమైన ఈ పనులన్ని రద్దు చేశాడు. రూ.12 లక్షల కోట్ల బడ్జెట్ లో రూ.2 వేల కోట్లు కూడా సీమ ప్రాజెక్టులకు ఖర్చు చేయలేదు.

### వీటికి సమాధానం చెప్పే దమ్ము వైసీపీకి ఉందా?

- వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమకు ఏం చేశామో వివరించి, రాయలసీమ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చారో చెప్పగలరా?
- గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, బిటి ప్రాజెక్ట్‌లాంటి 102 రాయలసీమ ప్రాజెక్టుల పనుల్ని జీఓ 365తో జగన్ ప్రభుత్వం ఎందుకు రద్దు (ప్రీ క్లోజర్) చేసింది?
- రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాయలసీమకు రూ.2 వేల కోట్లు కూడా ఎందుకు ఖర్చు చేయలేదు.?
- రాయలసీమ రైతులకు ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని ఎందుకు రద్దు చేశాడు.?
- అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది చావుకు ఎవరు కారణమయ్యారు.?
- హంద్రీనీవా కెనాల్ 1700 క్యూసెక్కుల సామర్థ్యాన్ని 3,500 క్యూసెక్కులకి ఎందుకు పెంచలేదు?
- జగన్ అసమర్థతతో ఆగిపోయిన రాయలసీమ లిఫ్టు కూటమి ప్రభుత్వం ఎలా అపివేస్తుంది?
- 2020లో ఆగిపోయిన లిఫ్ట్ పనులు నాలుగేళ్లల్లో అనుమతులు ఎందుకు సాధించలేకపోయారు?
- రాయలసీమ లిస్ట్‌పై జగన్ నాలుగేళ్లు కౌంటర్ అఫిడవిట్ వేయలేదు?
- ముచ్చుమర్రి మొదటి దశ 13 పంపుల్ని 2017లో చంద్రబాబు జాతికి అంకితం చేశారు. వివాదాలు లేకుండా రోజుకు 3 టీఎంసీల నీరు తోడుకునే సదుపాయం ఉన్న ముచ్చుమర్రిని పోతిరెడ్డిపాడుకు లింక్ చేసి... నిర్మాణ వసులు చేసి ఉంటే నిజంగా సీమకు లబ్ది జరిగేది. ఎన్జీటీ కూడా స్టే విధించేది కాదు. కానీ జగన్ రెడ్డి ఎందుకు ఈ పనులు చేయలేదు?
- 798 అడుగుల నుండి శ్రీశైలం రిజర్వాయర్ లోని సంగమేశ్వరం ప్రాంతం నుండి నీరు తీసుకునే సదుపాయం ఉంది. కానీ జగన్ ఎందుకు చేయలేదు?
- కుంగిపోయిన అలగనూరు రిజర్వాయర్ పనులకు రూ.36 కోట్లు ఎందుకు కేటాయించలేదు?
- పంజ్ పూల్తో శ్రీశైలం ప్రధాన డ్యాంకు ప్రమాదం ఏర్పడితే దానికి ఎందుకు నిధులు ఇవ్వలేదు?
- విచారణల నుండి తప్పించుకోవడానికి కృష్ణా మిగులు జలాల్లో హక్కు కోరబోమని బ్రిజేష్ ట్రిబ్యునలు లేఖ ఇచ్చి వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమకు తీరని నష్టం చేసింది వాస్తవం కాదా?

- ప్రవీణ్ బోయ
అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

### 2026-27 రాయలసీమ ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు

| ప్రాజెక్టు పేరు | కేటాయింపు (రూ. కోట్లలో) |
|---|---|
| హంద్రీ-నీవా | 2,621.74 |
| తెలుగుగంగ | 936.87 |
| గాలేరు-నగరి | 665.37 |
| వెలిగొండ | 492.9 |
| కడప ఇరిగేషన్ ప్రాజెక్టులు | 926.2 |
| కర్నూలు ఇరిగేషన్ ప్రాజెక్టులు | 479.57 |
| అనంతపురం ఇరిగేషన్ ప్రాజెక్టులు | 3,160.41 |
| కేసీ కెనాల్ | 184.38 |
| పులివెందుల కెనాల్ | 130.69 |
| తుంగభద్ర హెచ్ఎల్సీ స్టేజ్-1 | 50 |
| తుంగభద్ర హెచ్ఎల్సీ స్టేజ్-2 | 53.45 |
| తుంగభద్ర ఎల్ఎల్సీ | 250 |
| గురు రాఘవేంద్ర | 26 |
| శ్రీశైలం కుడి గట్టు కాలువ | 26 |
| గాజులదిన్నె | 11.62 |
| మొత్తం | రూ.10,014.21 కోట్లు |

## ఎంఎస్ఎంఈలతో యువతకు ఉపాధి

**రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత**



పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్య రథం): రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పెద్దఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆసక్తి కలిగిన యువత ముందుకొస్తే సబ్సిడీ రుణాలు అందజేసి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఫెర్టిలైజర్స్, పౌల్ట్రీ ఫీడ్ విక్రయ శాలలను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తనను కలిసి విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువతతో చిన్న, మధ్యతరహా పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేసి, వారికి వెన్నుదన్నుగా నిలవనుందని మంత్రి సవిత వెల్లడించారు.

**కూటమి రాకతో పంచాయతీలకు పూర్వవైభవం**

వైసీపీ పాలనలో నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. పాడైపోయిన వీధి బల్బులను సైతం మార్చడానికి కూడా వీలుండేది కాదన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎందరో వైసీపీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, మరెందరో చేసిన అప్పులు తీర్చడానికి కూలీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఆనాటి జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించారన్నారు. పంచాయతీలను దౌర్జన్యంగా గెలిపించుకోవడంలో ఉన్న శ్రద్ధ నిధులివ్వడంపై లేదని జగన్ నుద్దేశించి విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాకతో పంచాయతీలకు పూర్వవైభవం ప్రారంభమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు నేరుగా పంచాయతీలకే అందజేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 22 నెలల కాలంలో గ్రామాల్లో గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి చోటుచేసుకుందన్నారు. 2025-26కు సంబంధించి గ్రామాల్లో జరిగిన అభివృద్ధికి గానూ ప్రతిష్టాత్మక అయిదు కేంద్ర ప్రభుత్వ అవార్డులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ గెలుచుకుందన్నారు. ఇదీ కూటమి ప్రభుత్వం పాలనకు మచ్చుతునక అని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇకనైనా.. తీరు మార్చుకోండి

- ఇరిగేషన్ పనుల అంచనాల తయారీలో అలసత్వం తగదు
- ఆదివారంలోగా అంచనాలు సమర్పించండి...
- సీఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి నిమ్మల



అమరావతి (చైతన్య రథం): గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్టుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాలవారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీతవంటి పనులకు సంబంధించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబంధించి మార్చి 25లోపు నియోజకవర్గాలవారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటి వరకు కొంతమంది చీఫ్ ఇంజినీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారాయన.

కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడికతీతవంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ తరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్‌లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాల్వలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడంవల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బందిపడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్థిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కావున నియోజకవర్గాలవారీగా పనులకు సంబంధించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సీఈవోలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయానికి వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా హెచ్చరించారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదలచేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపువంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగు నీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబంధించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా,నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల అమలు
- సేవా సంస్థల తోడ్పాటు విస్మరించలేం..
- జగన్నాధగిరిలో మంత్రి వాసంశెట్టి సుభాష్



రామచంద్రపురం (చైతన్యరథం): కాజులూరు మండలం జగన్నాధగిరిలో పేద ప్రజలకు చేయూతగా, అనాధలకు రక్షణగా నిలుస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పి-4 కార్యక్రమంలో భాగంగా "మార్గదర్శి బంగారు కుటుంబం"లోని పేద కుటుంబానికి నూతన గృహ నిర్మాణానికి ఫౌండేషన్ అందించిన సహాయం ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మంత్రి హాజరై కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. మంత్రి మాట్లాడుతూ, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని, నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కాజులూరు ఎంపీడీవో రాంబాబు, జనసేన నాయకురాలు నల్లా వసంత హరిణి ,పి. రాజా, తెలుగుదేశం నాయకులు ధవులూరు సురేష్, యల్లా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే

# కూటమి ప్రభుత్వ తక్షణ కర్తవ్యం

- గత ప్రభుత్వంలో సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దుస్థితి
- వైసీపీ పాలనా పాపాల కారణంగానే రెవెన్యూ సమస్యలు
- ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- మచిలీపట్నంలో ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్య రథం): గత వైసీపీ పాలనలో వ్యవస్థలను నాశనం చేశారు. వారి పాపాల ఫలితంగానే నేడు రెవెన్యూ సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. "గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలన్నింటినీ పరిష్కరించాలి. ఇదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. నియోజకవర్గంలో ఇప్పటివరకు 335 ఫిర్యాదులు వచ్చాయి. 296 పరిష్కారం చేశాం. ఇంకా 20 పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పెండింగ్ వాటిలో కూడా 14 డిస్పోజ్ చేశాం. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో ఐదేళ్లు ఎవరైనా ఏదైనా సమస్యలు చెప్పుకోవాలన్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే వాలంటీర్లను పెట్టి ఫోటోలు తీసి వారిపైనే ఎదురు దాడి చేశారు. కూటమి ప్రభుత్వం జవాబుదారీతనంగా వ్యవహరిస్తోంది" అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

"ప్రతివారం నియోజకవర్గ స్థాయిలో ఫిర్యాదులు తీసుకుంటున్నాం. జిల్లా కలెక్టర్లు వారి పరిధిలో ప్రతి సోమవారం ప్రజల నుండి ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ప్రతి శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ ఉంటోంది. ఒకరోజు అటు ఇటుగా ఈ కార్యక్రమాలను చేస్తూ ముందుకు వెళ్తున్నాం. వీటిలో కొన్ని రెవెన్యూ, పోలీస్‌కు సంబంధించినవి ఉంటున్నాయి. ఎక్కువగా ఇళ్ల స్థలాల గురించే ఉంటున్నాయి. గత ప్రభుత్వం చేసిన అస్తవ్యస్త విధానాలు వల్ల ఇళ్ల సమస్యలు అధికంగా పేరుకుపోయాయి. రాబోయే కాలంలో వీటిని తీర్చేస్తాం. ప్రభుత్వం ఒకపక్క సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఎన్టీఆర్ భరోసా కింద 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. తల్లికి వందనం కింద రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం పిల్లల తల్లుల అకౌంట్లలో వేస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద 20 వేల రూపాయలు చొప్పున రైతు సోదరుల అకౌంట్లో వేస్తున్నాం. కేంద్రం ఇచ్చే రూ.7000 కాకుండా రాష్ట్రం 14000 అదనంగా కలిపి ఇస్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణం తెచ్చాం" అని మంత్రి వివరించారు.

"వైసీపీ అసమర్థ పాలన, జగన్‌రెడ్డివల్ల రాష్ట్రం నష్టపోయింది. కూటమి ప్రభుత్వం ఒక పక్క పోలవరం పనులు వేగవంతంగా చేస్తోంది. రేపు పుష్కరాల నాటికి గ్రావిటీ ద్వారా పోలవరం నీరు పారబోతున్నాయి. అమరావతి విషయానికొస్తే నిన్ననే కేంద్రం చట్టం చేసింది. పార్లమెంట్లో, రాజ్యసభల్లో కూడా ఏకగ్రీవంగా చేసుకోవడం జరిగింది. చివరకు అమరావతి పేరు కూడా జగన్ కు గిట్టడంలేదు. మావిగన్ అనే కొత్త పదం తీసుకొచ్చాడు. అమరావతి విషయంలో అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారు. దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు అమరావతికి సపోర్ట్ చేశాయి. అమరావతిని శాశ్వత రాజధానిగా తీసుకురాగలిగాం. అభివృద్ధిని చేసి చూపిస్తాం. రాష్ట్రంలో భారత దేశంలోనే తలమానికంగా నిలబెట్టబోతున్నాం" అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

మచిలీపట్నాన్ని సీఆర్డీఏలో కలపాలని ప్రతిపాదించాం. జిల్లాలో దాదాపు 11 మండలాలు సీఆర్డీఏ పరిధిలో ఉన్నాయి. మిగతా మండలాలు కూడా సీఆర్డీఏ పరిధిలోకి వస్తాయి. ఆపాటి ఇంగిత జ్ఞానం లేదు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి భవిష్యత్ తరాలకు అన్యాయం చేసేందుకు జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

## అమరావతి అజరామరం : ఎంపీ కలిశెట్టి

● నా రాజధాని అమరావతి అంటూ ఎచ్చెర్లలో భారీ ర్యాలీ



విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రుల రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం హర్షణీయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం శ్రీకాకుళం, ఎచ్చెర్ల మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలతో కలిసి నా రాజధాని అమరావతి అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని అమరావతిగా చట్ట సవరణ ద్వారా తీర్మానం చేయడంతో ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. దేవతల రాజధానిగా అమరావతి నిలుస్తుందని, ఎవరూ ఎన్ని అడ్డంకులు సృష్టించిన అమరావతిని ఏం చేయలేరని అన్నారు. రాజధాని కోసం 33 వేల ఎకరాల భూమిని అక్కడి రైతులు త్యాగం చేశారని, వారి త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. అమరావతి రాజధానికి ఈనాడు, ఈటీవీ యాజమాన్యం అండగా నిలిచాయని, ఈనాడు గ్రూప్ ఛైర్మన్ దివంగత రామోజీరావు రాజధాని సాధన కోసం చేసిన కృషి అభినందనీయమన్నారు. అమరావతిపై నీలిమీడియా చేసే ఆరోపణలకు అడ్డుకట్ట వేస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవాలు తెలియజేసిన ఈనాడు సంస్థలకు ధన్యావాదాలు తెలియజేశారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. అమరావతి అజరామరమని, ఇకపై ఏ దుష్టశక్తి దీన్ని అడ్డుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

● విశాఖపట్నం ఎంజేపీ గురుకుల పాఠశాల హాస్టల్‌ను పరిశీలించిన మాజీమంత్రి గంటా



విశాఖపట్నం (చైతన్యరథం): సింహాచలంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ ) గురుకుల పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు .. గురుకుల పాఠశాలను సందర్శించారు. హాస్టల్ గదులు, కిచెన్, స్టోర్ రూమ్, వాష్ రూమ్‌లను పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన గంటా శ్రీనివాసరావు.. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటన చాలా బాధాకరం. ప్రభుత్వం విద్యా రంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నప్పటికీ.. ఇలాంటి ఘటన జరగడం చాలా దురదృష్టకరం. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించేందుకు ఇప్పటికీ కొన్నిచోట్ల విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కొరత కనిపించింది. హాస్టల్ వాష్ రూమ్ చూడ్డానికి నాకే సిగ్గు వేసింది. హాస్టల్లో విద్యార్థులను ఎలుకలు కొరకడం అవమానం. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిని తక్షణమే సస్పెండ్ చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ పంపించమని ఆదేశాలు జారీ చేశాం. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోమని ఆదేశించాం. ఎలుకలు హాస్టల్లో చేరడానికి కారణాలపై నివేదిక తీసుకుంటున్నాం. త్వరలోనే గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేస్తాం అని గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరోవైపు సింహచలం ఎంజేపీ గురుకుల పాఠశాల హాస్టల్ గదిలో నిద్రపోతున్న పది మంది విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటన కలకలం రేపింది. మూడు రోజులలో మొత్తం పది మంది విద్యార్థులకు గాయాలైనట్లు సమాచారం. హాస్టల్ భవనానికి మరమ్మతులు చేస్తున్న క్రమంలో.. కిటికీల మెష్‌లు తొలగించటంతోనే ఎలుకలు లోపలికి వచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని.. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## రాష్ట్రంలో పెరిగిన పాలు, పెరుగు ధరలు

●పెరిగిన ధరలు నేటి నుంచి అమల్లోకి వస్తాయన్న డెయిరీలు

ఆంధ్రప్రదేశ్‌లో పాలు ధరలు పెరిగాయి.. ఇటీవల రైతులకు పాలసేకరణ ధరలు పెరగడం, వ్యయం పెరగడంతో.. విజయ, సంగం డెయిరీలు పెంచిన సంగతి తెలిసిందే. ఈ మేరకు విజయ, సంగం డెయిరీ పాల ప్యాకెట్ల ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. మార్కెట్‌లో విజయ లీటరు పాల ధరను రూ.2 చొప్పున పెంచినట్లు కృష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. ఈ నెల 4 నుంచి పెరిగిన ధరల కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో అమల్లోకి వస్తాయని తెలిపింది. ఈ నెల 9 వరకు నెలవారీ పాల కార్డు కొనుగోలు చేసిన వారికి మాత్రం పాత ధరలు వర్తిస్తాయి. మొత్త ఏడు రకాల పాల ధరలు పెంచారు. అంతేకాదు పెరుగుపై రూ.10 నుంచి రూ.30 వరకు పెరిగింది. 10 కేజీల స్టాండర్డ్ మిల్క్ పెరుగు బకెట్ ధర రూ.40 పెరిగింది.

మరోవైపు సంగం డెయిరీ కూడా ప్రస్తుతం ఉన్న ధరకు లీటరు ప్యాకెట్‌పై రూ.2, అర లీటరు ప్యాకెట్‌పై రూ.1 చొప్పున పెంచింది. పాల ప్యాకెట్లపై పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని ఎండీ గోపాల కృష్ణన్ తెలిపారు.

## ఏపీలో మద్యం అల్ టైమ్ రికార్డ్ అమ్మకాలు... పెరగని ఆదాయం

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో 2025-2026లో మద్యం అమ్మకాలలో ఆల్ టైమ్ రికార్డ్ నమోదైంది. మొత్తం అమ్మకాలు గణనీయంగా పెరగగా.. బీర్ అమ్మకాలు 70శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం.. బీర్ అమ్మకాలు 70.29శాతం పెరగ్గా.. ఇండియన్ మేడ్ లిక్కర్ కేసుల విక్రయాలు మాత్రం 14.59 పెరిగాయి. మొత్తం అమ్మకాల విలువ 6.11 పెరిగినా.. రాబడి కేవలం 4.01 మాత్రమే పెరిగింది.. దీంతో మొత్తం ఆదాయం వృద్ధి 0.68 గా నమోదైంది. అమ్మకాలు భారీగా కనిపిస్తున్నా ఆదాయం మాత్రం పెద్దగా పెరగలేదు. ఏపీ ప్రభుత్వం మద్యాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో ఆదాయం ఆశించిన స్థాయిలో రాలేదంటున్నారు. మద్యం ప్రియుల ప్రాధాన్యత మారిందని.. అలాగే ప్రముఖ బ్రాండ్‌ల ధరల తగ్గింపుతో రాష్ట్రానికి దాదాపు రూ.972 కోట్ల ఆదాయం సమకూరిందని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బీర్ల అమ్మకాలను గమనిస్తే.. ముఖ్యంగా యువత బీర్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు తేలిందన్నారు. అలాగే ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని అందిస్తుండటంతో అమ్మకాలు పెరిగాయంటున్నారు. 180 ఎంఎల్ బాటిల్ ధర రూ.99 కాగా.. కానీ ఎంఆర్‌పి దాదాపు రూ.442గా ఉంది.. ఈ అమ్మకాల ద్వారా ఆదాయంలో సుమారు 17.64 సమకూరిందని ఆయన వివరించారు. గతంలో ధరలతో పోలిస్తే ప్రముఖ బ్రాండ్‌ల లిక్కర్ ఎంఆర్‌పీని సగటున రూ.160-రూ.180 వరకు తగ్గించడంతో దాదాపు రూ.972 కోట్ల ఆదాయాన్ని కోల్పోయినట్లు తెలిపారు. అధికారిక గణంకాలను బట్టి అమ్మకాలు భారీగా కనిపిస్తున్నా.. రాబడి మాత్రం పెరగలేదని అధికారులు చెబుతున్నారు. మొత్తం అమ్మకాలలో తక్కువ ధర ఉన్న మద్యం వాటా పెరగడమే దీనికి ప్రధాన కారణం అంటున్నారు. మద్యం విక్రయాల్లో తక్కువ ధర ఉన్న మద్యం ఎక్కువగా ఉండటంతో అమ్మకాలు పెరిగినా రాబడి మాత్రం పెరగలేదు. మొత్తంగా చూస్తే మద్యం అమ్మకాలు భారీగా పెరిగినా.. ఆదాయం మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. అయితే ఆసక్తికరంగా బీర్ల అమ్మకాలు మాత్రం 70శాతానికి పైగా పెరగడం విశేషం. బీర్ల అమ్మకాలు 136 లక్షల కేసుల నుంచి 232 లక్షల కేసులకు పెరిగినట్లు తెలుస్తోంది. లిక్కర్ అమ్మకాలు 362 లక్షల కేసుల నుంచి 414 లక్షల కేసులకు పెరిగాయంటున్నారు. 2025-2026లో రూ.31,237 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయని సమాచారం.

## నేడు 54 మండలాల్లో తీవ్ర వడగాల్పులు



అమరావతి (చైతన్యరథం): రానున్న రెండు రోజులు ఎండతీవ్రత ఎక్కువగా ఉండి 42-43C వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం 54 మండలాల్లో తీవ్రవడగాలులు, 16 మండలాల్లో వడగాలులు, శనివారం 41 మండలాల్లో తీవ్రవడగాలులు, 21 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు.

**శుక్రవారం(03-04-26)54 మండలాల్లో తీవ్ర వడగాల్పులు**

శుక్రవారం (03-04-26) శ్రీకాకుళం జిల్లాలో 13, విజయనగరం 19, పార్వతీపురంమన్యం 11, అల్లూరి 2, పోలవరం 3, విశాఖ 2, అనకాపల్లి 2, కాకినాడ 2 మండలాల్లో తీవ్ర వడగాలులు(54) వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం 2, విజయనగరం 4, మన్యం 2, పోలవరం 1, అనకాపల్లి 2, కాకినాడ 1, తూర్పుగోదావరి 2, ఏలూరు 1, ఎన్టీఆర్ 1 మండలాల్లో వడగాలులు(16) ప్రభావం చూపనున్నట్లు తెలిపారు.

**ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

వడగాలులు వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్ధులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలని, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు.

## విశాఖ ఐఐఎంకు అంతర్జాతీయ గుర్తింపు

● ఐదేళ్లపాటూ లభించిన అక్రిడిటేషన్



విశాఖపట్నం ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)కు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. లండన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక బీజీఏ (బిజినెస్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్) విశాఖపట్నం ఐఐఎంకు ఐదేళ్ల అక్రిడిటేషన్ వచ్చింది. బీజీఏ నుంచి అక్రిడిటేషన్ లభించినట్లు ఐఐఎంవీకి సమాచారం అందింది. అత్యున్నత విద్యా ప్రమాణాలను పాటించే విద్యా సంస్థలకు ఈ గుర్తింపు లభిస్తుందని చెబుతున్నారు. దేశంలోనే అత్యుత్తమ బిజినెస్ స్కూళ్ల జాబితాలో ఐఐఎంవీ చేరిందని డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం చంద్రశేఖర్ తెలిపారు. ఐఐఎం విద్యార్థుల భాగస్వామ్యం, టీచింగ్, నాన్ టీచింగ్ సమిష్టి కృషితో అక్రిడేషన్ సాధ్యమైంది అన్నారు. ఈ గుర్తింపు అంతర్జాతీయ ప్రమాణాల విషయంలో తమ నిబద్ధతకు నిదర్శనమని ప్రొఫెసర్ చంద్రశేఖర్ అన్నారు. నాణ్యమైన విద్య, బాధ్యతాయుతమైన నిర్వహణ, అభివృద్ధి ఐఐఎం విలువలని.. ఈ అక్రిడిటేషన్ వాటిని మరింత ప్రతిబింబిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ గుర్తింపుతో ప్రపంచస్థాయిలో ఐఐఎంవీ ప్రతిష్ట మరింత పెరుగుతుందన్నారు. ఐఐఎంలో విద్యావిధానం, విద్యార్థుల భాగస్వామ్యం, అధ్యాపకుల నైపుణ్యం, పరిపాలన వంటి పలు అంశాలను బీజీఏ పరిశీలించిన తర్వాతే అక్రిడిటేషన్ ఖరారు చేశారన్నారు. ఐఐఎంవీలో వినూత్నమైన విద్యా ప్రణాళిక, స్టార్టప్‌లకు ఇస్తున్న ప్రోత్సాహంతో పాటుగా విద్యాబోధనను నిపుణుల బృందం ప్రశంసించినట్లు తెలిపారు. అంతర్జాతీయ గుర్తింపుతో విదేశీ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలకు, ఇంటర్నేషనల్ రీసెర్చ్ వంటి కొత్త అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. బీజీఏ (బిజినెస్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్) ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సులు అందించే విద్యా సంస్థల పనితీరును అసెస్‌మెంట్ చేస్తుంది. దేశంలో బీజీఏ గుర్తింపు పొందిన విద్యాలయాల జాబితాలో చేరడంపై విశాఖ ఐఐఎం సంతోషాన్ని వ్యక్తం చేసింది. విశాఖపట్నంలోని ఆనందపురం మండలం గంభీరంలో ఐఐఎం క్యాంపస్ ఉంది. విశాఖపట్నంలోని ఐఐఎం విద్యాలయంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో పాటుగా విదేశాల నుంచి కూడా కొంతమంది విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. విశాఖపట్నం ఐఐఎం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లోనూ ముందు వరుసలో ఉంది. ఐఐఎంకి క్యాంపస్ ఇంటర్వ్యూలో కూడా వస్తున్నాయి. అంతేకాదు నైపుణ్యాభివృద్ధి, ఆంత్రప్రెన్యూర్‌షిప్, నాయకత్వ లక్షణాలను పెంపొందించే కార్యక్రమాలు, సర్టిఫికేషన్ కోర్సుల నిర్వహిస్తోంది.

# గోదావరి మహా పుష్కరాలకు మహా ఏర్పాట్లు

**●ఉమ్మడి గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ఘాట్లను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): 2027 జూన్ నెలాఖరు నుంచి జూలై మొదటి వారం వరకు 12 రోజుల పాటు జరగనున్న గోదావరి మహా పుష్కరాల నేపథ్యంలో గోదావరి జిల్లాల్లో పండుగ వాతావరణం ముందుగానే ప్రారంభమైంది. ముఖ్యంగా రాజమండ్రి కేంద్రంగా ఏర్పాట్లు వేగంగా కొనసాగుతుండగా, ఉమ్మడి గోదావరి జిల్లాలన్నింటిలోనూ అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆధ్యాత్మిక కాంతితో వెలిగే ఈ ప్రాంతం, పుష్కరాల సందర్భంగా మరింత వైభవంగా మారేందుకు సిద్ధమవుతోంది.

12 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ మహా పర్వదినానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అలాంటి భారీ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ఘాట్లను అభివృద్ధి చేయడం, మెట్లను పునరుద్ధరించడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడం వంటి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఘాట్లను మినీ పార్కుల తరహాలో తీర్చిదిద్దుతూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యాన్ని అందించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

ప్రస్తుతం రాజమండ్రి ఘాట్లు ప్రతిరోజూ భక్తులతో కళకళలాడుతున్నాయి. పుష్కరాల సమయానికి లక్షలాది మంది పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉండటంతో, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, పార్కింగ్ వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నారు. గోదావరి తల్లికి ప్రతిరోజూ నిర్వహించే హారతి కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమై భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పుష్కరాల నాటికి ఈ ప్రాంతం సంపూర్ణ ఆధ్యాత్మిక క్షేత్రంగా మారేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో కూడా అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం, ర్యాలీ వంటి పుణ్యక్షేత్రాల్లో ఆలయాల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి రాజగోపురం నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, వాగ్దేవి నగర మహాలక్ష్మి దేవి దేవస్థానంలో ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులన్నీ పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో వేగంగా కొనసాగుతున్నాయి.

పుష్కరాల సమయంలో భక్తులు తప్పక దర్శించే పుణ్యక్షేత్రాల జాబితా కూడా విస్తృతంగా ఉంది. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అన్నవరం, లోవ తలుపులమ్మ అమ్మవారి ఆలయం నుంచి పిఠాపురం వరకు అనేక క్షేత్రాలు భక్తులతో కిక్కిరిసే అవకాశం ఉంది. అలాగే సామర్లకోట, ద్రాక్షారామం, కుమారరామ భీమేశ్వర స్వామి వంటి పుణ్యక్షేత్రాలు కూడా ఈ మ త్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

మొత్తానికి 2027లో జరగనున్న గోదావరి మహా పుష్కరాల సందడి ఇప్పటినుంచే ప్రారంభమైందని చెప్పుకోవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ గోదావరి ప్రాంతాన్ని మరింత అందంగా, ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతున్నారు. పుష్కరాల సమయానికి ఈ ప్రాంతం భక్తి, భవ్యత, వైభవంతో కళకళలాడే ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుంది.

# అమరావతి చట్టబద్ధత ముమ్మాటికి దైవ నిర్ణయమే

**● 11 గంటల 11 నిమిషాలకు ఆమోదముద్ర పడటం కాకతాళీయమే: ఎమ్మెల్యే యనమల దివ్య**



ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించలేదు. ఇది ముమ్మాటికి ఆ భగవంతుడు నిర్ణయించారు. అందుకే అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లు ఆమోదిస్తూ ప్రకటించిన సమయం 11.11 అంటూ ఒక టీడీపీ మహిళ ఎమ్మెల్యే సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. అసలు 11.11సమయం అంటే ఏంటో తెలుసా..? మీరు గూగుల్ లేదా ఆధ్యాత్మికవేత్తలను అడగండి తెలుస్తుంది. ఎంతో శుభ పరిణామం సాత్తు దేవతలు దైవతామూర్తులు ఆశీస్సులు ఉంటే తప్ప అలాంటి సమయం రాదు. ఇది ముమ్మాటికీ దైవ నిర్ణయం అందులో తిరుగులేదు అని ఎమ్మెల్యే యనమల దివ్య వ్యాఖ్యానించారు.

**ప్రజారాజధాని అమరావతి..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని డిక్లేర్ చేస్తూ పెద్దల సభ ఆమోదం తెలిపారు. దీంతో ఒక వైసీపీ మినహా అన్ని పార్టీలు మద్దతు తెలుపుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి సంబంధించిన ఎమ్మెల్యేలు మంత్రులు పెద్దఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ గమ్మత్తైన విషయం ఏమిటంటే వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 11 కాబట్టి వైసీపీకి కౌంటర్ ఇచ్చినట్లుగా రాజ్యసభలో ఈ బిల్లు ఏప్రిల్ 2న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు ఆమోదముద్ర పడింది.

# తెనాలిలో ఒంగోలు జాతి జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన



తెనాలి (చైతన్యరథం): ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారకార్థం నిర్వహించిన "ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బల మరియు పశుపాల ప్రదర్శన" కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ... ఒంగోలు జాతి ఎడ్లు మన ఆంధ్రప్రదేశ్ గర్వకారణం. ఇలాంటి కార్యక్రమాలు మన పశుసంపదను పరిరక్షించడంలో, రైతులకు ప్రోత్సాహం ఇవ్వడంలో ఎంతో ఉపయోగపడతాయి. ఇంత గొప్ప కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి, నిర్వాహకులకు మన్నవ మోహనకృష్ణ అభినందనలు తెలిపారు.

# కొవ్వూరులో గ్రీవెన్స్ డే నిర్వహించిన ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు వారి సమస్యలు తెలియజేస్తూ సుమారు 17 వినతి పత్రాలను అందజేశారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కార దిశగా పలు సమస్యలపై సంబందిత అధికారులతో మాట్లాడారు. అనంతరం టీడీపీ కేడర్ మీటింగ్ నిర్వహించారు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సమావేశంలో టుమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష, నామన పరమేశ్, సిద్ద దుర్గా ప్రసాద్, బేతిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం : గిరీష్ వర్మ



పిఠాపురం(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కార్యకర్తలు ఆహ్వానం మేరకు మాజీ శాసనసభ్యులు ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ తనయుడు యువనాయకుడు గిరీష్ వర్మ పిఠాపురం మండలంలో కుమారపురం, కందరాడ, జల్లూరు, విరవ, కోలంక, లక్ష్మీ నర్సాపురం, జములపల్లి, గోకివాడ, బి. కొత్తూరు, విరవాడ, ఎఫ్. కే. పాలెం, బి. ప్రత్తిపాడు, నావఖండ్రవాడ గ్రామమంలో పర్యటించి కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు ఎప్పుడు మన పార్టీ అండగా ఉంటుందని, పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు.

# ఏపీకి అమరావతే ఏకైక రాజధాని

**● అమరావతి బిల్లు ఆమోదం పొందిన వేళ కాకినాడలోని ఎంపీ సానా సతీష్‌బాబు కార్యాలయంలో శ్రేణుల హర్షం**



కాకినాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. శుక్రవారం ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో అమరావతి రాజధాని సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర ప్రజలందరికీ గొప్ప శుభపరిణామమని అన్నారు. ఇకపై అమరావతిని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ బిల్లుకు విస్తృత మద్దతు లభించిందని, వైసీపీ మినహా ఇతర పార్టీలు మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారని విమర్శిస్తూ, భవిష్యత్తులో అమరావతి హైదరాబాద్, బెంగళూరు తరహాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అంశంపై ఉన్న అనిశ్చితి పూర్తిగా తొలగిపోవడంతో ప్రజల్లో అపూర్వమైన ఆనందం నెలకొన్నదన్నారు. "జయహో అమరావతి" పేరిట రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవాలు జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.వై దాసు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, అంకంరెడ్డి రామునాయుడు, జున్నూరి బాబ్జి, కామాడి దశరథ్, ఆనంద్ న్యూటన్, పబ్బినేడి అజయ్ కుమార్, పుల్ల మురళి, బర్ల శ్రీనివాస్, కర్రి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు ఎన్నికల వేళ ఈనెల 9, 23న పెయిడ్ హాలీడే

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పనిచేస్తు తమిళనాడు, పుదుచ్చేరి ఓటర్లకు పోలింగ్ రోజు పెయిడ్ హాలిడే ప్రకటించింది. ఈ నెల 9న పుదుచ్చేరిలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.. 23న తమిళనాడులో కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమతో పాటుగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన ఓటర్ల కోసం కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో ఈ రెండు రా(ష్టాలకు సంబంధించిన ఓటర్లు ఎవరైనా పనిచేస్తుంటే.. వారికి ఆయా రా(ష్టాల ఎన్నికల పోలింగ్ రోజు పెయిడ్ హాలీడే ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. ఈ నెల 9న పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి.. ఈ నెల 23న తమిళనాడులో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నిక సంఘం ఆదేశాలతో ఆయా తేదీల్లో ఆయా రా(ష్టాల ఓటర్లకు పెయిడ్ హాలీడే మంజూరు చేయాలని సీఎస్ జి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# బడ్జెట్‌పై అవగాహన సదస్సుకు రండి

**◆ప్రజాదర్బార్‌లో టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పిలుపు**

**◆ప్రజల నుంచి వినతిప్రతాలు స్వీకరణ**




విజయవాడ (చైతన్యరథం): ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలియజేస్తూ, బడ్జెట్టుపై శనివారం నాడు తమ కార్యాలయంలో జరగనున్న అవగాహన సదస్సుకు అందరూ హాజరవ్వాలని ఆయన కోరారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిప్రతాలను తీసుకున్నారు. వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులకు సూచించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ... శనివారం నాడు బడ్జెట్‌పై అధికారులు, నాయకులు అవగాహన కల్పిస్తారని, అందరూ హాజరై... అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... ప్రజాదర్బార్‌ను ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ డివిజన్లల్లోని ప్రజలు పెద్దఎత్తున వచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తున్నారని, తమ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు వాటిని తెలుసుకొని, పరిష్కరిస్తున్నారని చెప్పారు. అధికంగా టిడ్కో ఇళ్లు, ఇంటి స్థలాలు, పెన్షన్లు ఇప్పించమని కోరుతున్నారని చెప్పారు. ఇవన్నీప్రభుత్వం సంబంధిత స్కీములు ప్రకటించిన తర్వాత ఇవ్వడం వీలవుతుందని వారికి చెబుతున్నామని, ఇతర సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని చెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**●గుంటూరులో ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం – ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వివరించగా, వాటిని సంబంధిత శాఖలకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల అర్జీలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలకు వెంటనే స్పందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# క్రీస్తు మార్గం అనుసరణీయం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఏసుప్రభు స్ఫూర్తితోనే సమాజసేవ కొనసాగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం సుద్దపల్లిడొంకలోని శ్మశాన వాటికలో గుర్రం జాషువా సమాధి వద్ద ఎమ్మెల్యే నసీర్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి శాంతి మార్గాన్ని క్రీస్తు తన జీవితం ద్వారా తెలియజేశారని చెప్పారు. సహనాన్ని ఆయుధంగా మలుచుకొని ప్రతి ఒక్కరిలో మంచి గుణాలను పెంపొందించాలని చెప్పారు. క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. సకల మానవులకు శాంతి చేకూర్చాలని క్రీస్తు జన్మించారని తెలిపారు. ప్రతి ఒక్కరిలో దయాగుణం అలవర్చుకునేలా తన జీవితాన్ని కొనసాగించాలని చెప్పారు. మానవజాతి కోసం తన రక్తాన్ని చిందించిన యేసు తిరిగి పునరాత్థానుడై తిరిగి వస్తారని తెలిపారు.

# గన్నవరంలో సి-డాక్ కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే వెంకట్రావు సన్నహకాలు

గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గత మూడు నెలలుగా ఆయన నిరంతర కృషి చేస్తూ, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సి–డాక్) కేంద్రాన్ని గన్నవరంలో ఏర్పాటు చేయాలనే దిశగా చర్యలను ముమ్మరం చేశారు. మూడు నెలల క్రితం సి–డాక్ బృందాన్ని స్వయంగా కలిసి గన్నవరానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే, ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లతో ప్రాథమిక చర్చలు జరిపారు. ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ఉన్న సి డాక్ , ఆంధ్రప్రదేశ్ లో తన 13 వ కేంద్రాన్ని గన్నవరం లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.200 కోట్ల నిధులను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే విన్నపం మేరకు గన్నవరానికి వచ్చిన ప్రతినిధి బృందం, స్థానికంగా అందుబాటులో ఉన్న స్థలాలు మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించి, సి–డాక్ కేంద్రం ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సి–డాక్ ప్రతినిధి బృందం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసింది. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టు రూపకల్పనపై లోతైన చర్చలు జరిగాయి. గన్నవరంలో హై–పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పరిశోధనలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కేంద్రం ద్వారా ఐటీ, డేటా సైన్స్ వంటి రంగాల్లో అత్యున్నత స్థాయి అవకాశాలు కల్పించడంతో పాటు, స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏఐ, వీఎల్ఎస్ఐ వంటి విభాగాల్లో శిక్షణ అందించాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**● అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు**



ప్రత్తిపాడు (చైతన్యరథం): నియోజకవర్గ క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం చూపడం కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులను పారదర్శకంగా స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపించి తక్షణ చర్యలు తీసుకునే విధంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా పరిగణించి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు అధికారులు కట్టుబడి పనిచేస్తున్నారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వ్యాఖ్యానించారు.

# రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన



పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ కానూరు పరిధిలో మురళీనగర్ గుంటుపల్లి వారి విధి నుండి ప్రసాదంపాడు రోడ్డు వరకు రూ.1 కోటి 3 లక్షలతో నిధులు నిర్మించి రోడ్డు పనులకు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడెప్రసాద్ మాట్లాడుతూ... అధికారంలోకి రాగానే రాష్ట్రంలో రోడ్లకు పూర్వవైభవం తెచ్చేలా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని, వేలకోట్ల నిధులతో గుంతలు పూడ్చడం మరమ్మత్తులతో పాటు నూతన రోడ్ల నిర్మాణం... నాడు గుంతల మయమైన రోడ్లు నేడు సుందరంగా చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం బాధ్యతగా తీసుకుని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రోడ్లు నిర్మాణాలు చేస్తున్నామన్నారు. రూ.1కోటి 3 లక్షల రూపాయల నిధులతో రోడ్డు ఏర్పాటు కొరకు శంకుస్థాపన చేశామని, మిగిలి ఉన్న రోడ్లు డ్రైయిన్లు కూడా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

**● ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ (చైతన్యరథం): ప్రజాదర్బార్ ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నామని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో "ప్రజాదర్బార్ కార్యక్రమం" నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రతి శుక్రవారం "గ్రీవెన్స్ డే"గా నిర్వహిస్తూ ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులకు తెలియజేసే వేదికగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు ఇళ్ల నిర్మాణం, పింఛన్ల మంజూరు, వికలాంగులకు ట్రైసైకిళ్లు, "తల్లికి వందనం" పథకం, ఆర్థిక సహాయాలు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు, చిరువ్యాపారుల సమస్యలు తదితర అంశాలపై పెద్ద సంఖ్యలో వినతులు అందిస్తున్నారని తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించగలిగిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, ఇతర సమస్యలను సంబంధిత శాఖలకు పంపిస్తున్నామని చెప్పారు. మున్సిపల్, కార్పొరేషన్, డిప్యూటీ కమిషనర్లు, బీసీ డిపార్ట్‌మెంట్ తదితర శాఖలకు చెందిన సుమారు 10 మంది అధికారులు కార్యాలయంలోనే కూర్చొని సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్నారని తెలిపారు, ప్రతి అర్జీని నమోదు చేసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపిస్తూ, పరిష్కారం వచ్చే వరకు పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి సంక్షేమాన్ని అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# అమరావతికి ఆమోదముద్రతో మతి చలించిన జగన్

## నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి




నెల్లూరు (చైతన్యరథం): మావిగన్ పేరుతో మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ను కలిపి రాజధాని చేయాలని డిమాండ్ చేస్తున్న జగన్ అధికారంలో ఉన్నప్పుడు, ఈ ప్రతిపాదనను ఎందుకు చేయలేదని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ప్రశ్నించారు. కోవూరులోని తన కార్యాలయం ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతికి చట్ట బద్ధత కల్పించే బిల్లుకు బుధవారం లోకసభలోను, బిల్లును తీసుకురావడంలో అన్ని విధాలుగా సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో సహా ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఊరందరిదీ ఒక దారి అయితే, ఉలిపి కట్టే దొంక దారి అనే సామెత లాగా రాష్టానికి సంబంధం లేని రాజకీయ పార్టీలు కూడా మద్దతు ఇస్తే, మన రాష్ట్రానికి చెందిన వైసీపీ మాత్రమే వ్యతిరేకించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే వైసిపి పార్టీకి రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత కూడా లేదన్నారు. రాజధాని అమరావతికి చట్ట బద్ధత కల్పించడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న జగన్ మోహన్ రెడ్డి అర్థం కాకుండా మాట్లాడుతున్నారన్నారు. అమరావతి చట్టబద్ధత కోసం అకుంఠిత దీక్షతో కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.



పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలంలో గ్రీవెన్స్ నిర్వహించిన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్



నెమ్మలిగుండం రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న టీడీపీ ప్రజాప్రతినిథులు

# సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా

## ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్




వింజమూరు (చైతన్యరథం): వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వయంగా స్వీకరిస్తూ ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సంబంధిత సమస్యలు, మౌలిక వసతుల లోపాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, పింఛన్లు వంటి అనేక అంశాలపై ఎమ్మెల్యే శ్రద్ధగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్యల తీవ్రతను బట్టి వెంటనే స్పందిస్తూ, అవసరమైతే ప్రత్యక్షంగా పరిశీలన చేసి, త్వరితగతిన పరిష్కారం అందేలా కృషి చేస్తున్నారు

# నెల్లూరు రూరల్‌లో నిరాటంకంగా ప్రజాదర్బార్

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జరిగింది. ఈ సందర్భంగా రూరల్ టీడీపీ నేత గిరిధరల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన వినతులలో ఇప్పటికే 27 కోట్లతో 240 అభివృద్ధి పనులకు ప్రారంభించడం ద్వారా ప్రజాదర్బార్ సార్ధకమయిందన్నారు. ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, కో క్లస్టర్ ఇంచార్జ్ రాపూరు శేఖర్, 23వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు మేకల మధు, 28వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు చెక్క సాయి సునీల్, టిడిపి నాయకులు గౌస్ , వనజా రెడ్డి, మేఘనాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.




# సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

## అర్జీలు స్వీకరించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి




కావలి (చైతన్యరథం): నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రజల సమస్యలను నేరుగా విన్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్‌లో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, విద్యుత్ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, భూమి వివాదాలు వంటి పలు అంశాలపై ప్రజలు తమ సమస్యలను వ్యక్తం చేశారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరగా తీసుకురావడం తమ లక్ష్యం అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడం కోసం నిరంతరం కృషి చేస్తాం" అని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అల్లూరు మండల అభివృద్ధిపై కూడా ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని, రహదారుల అభివృద్ధి, తాగునీటి సదుపాయాల మెరుగుదల, వ్యవసాయానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు అవసరమైన నీటి వనరులు, ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. "రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది. రైతుల సమస్యల పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. రైతాంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటాను" అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో పెరిగిందని, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

# ప్రేమకు, త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే

## టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా దర్శి పట్టణం, పొదిలి రోడ్ లోని సేయింట్ జేవియర్స్ చర్చిలో శుక్రవారం సాయంత్రం ఫాస్టర్ బాల సౌరితో పాటు కలిసి దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే మానవాళి కోసం యేసుక్రీస్తు చేసిన అపారమైన త్యాగాలను మనకు గుర్తుచేస్తుందని తోటివారి పట్ల దయతో మెలగడమే దేవునికి ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏ.ఎం.సి చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు పిల్లలచెరువు సత్యనారాయణ, దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టివెన్, శోభరణి ఎస్సీ సోదరులు, కూటమి శ్రేణులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

## పాల్గొన్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం (చైతన్యరథం): రామ్‌నగర్‌లోని ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజాదర్బార్"లో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు తమ సమస్యలను మంత్రివర్యులకు తెలియజేశారు. మంత్రి స్వయంగా వారి సమస్యలను శ్రద్ధగా విని వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండూ ముఖ్యమన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్)లో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ గారి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రివర్యులు ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరఫున, తెలుగుదేశం పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.






## అనంతపురం అర్బన్‌లో ప్రజా దర్బార్

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతల వారీగా పరిష్కారమయ్యేల చర్యలు తీసుకుంటామని అనంతపురం శాసనసభ్యుడు దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి అర్జీలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

# భవన నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దు

## బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): రొద్దం మండలం ఆర్. మరువపల్లి గ్రామం వద్ద రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలుర (వీజ్రీ) నూతన భవనాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, పనులు నాణ్యతతో పాటు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, సౌకర్యాలు కల్పించడం కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# వైభోగంగా ఒంటిమిట్ట రాముడి బ్రహ్మోత్సవాలు



ఒంటిమిట్ట (చైతన్యరథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వార్షికబ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం కాళీయమర్ధనుడి అలంకారంలో జగదభిరాముడు దర్శనమిచ్చారు. తొలుత శ్రీరామచంద్రమూర్తిని పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ మాడ, పుర వీధుల్లో రాములోరి గ్రామోత్సవాన్ని ఆద్యంతం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు, యువతులు, మహిళలు కోలాటం, చెక్క భజన ప్రదర్శనలు చేశారు. శుక్రవారం రాత్రి అశ్వ వాహనంపై కల్యాణ రాముడు ఆశీనులై విరించారు. రామయ్యను పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ మాడ, గ్రామం వీధుల్లో జగదభిరాముడి గ్రామోత్సవం వైభవంగా సాగింది. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు, యువతులు, మహిళలు కోలాటం ప్రదర్శనలు విశేషంగా అలరించాయి.



# పాఠశాలలో అమరావతి సంబరాలు

రొద్దం, (చైతన్యరథం): నియోజకవర్గంలోని రొద్దం కేజీబీవీ పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి సౌకర్యాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమోదం లభించిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ వేడుకలో విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. .




యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లీడ్స్ నగరంలో విజయోత్సవ వేడుకలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు


యునైటెడ్ కింగ్‌డమ్‌లోని కోవెంట్రీ నగరంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద సంబరాల్లో పాల్గొన్న ప్రవాసాంధ్రులు

# జయహో అమరావతి

- ఖండాంతరాల్లో ప్రతిధ్వనించిన 'జై అమరావతి' నినాదం
- "జై చంద్రబాబు... జై లోకేష్" అంటూ నినాదాల హోరు
- యూకే, ఖతార్, సౌదీల్లో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో సంబరాలు
- కేక్‌లు కట్ చేసిన ప్రవాసాంధ్రులు
- ఏపీ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతామని ప్రతిన




**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతికి పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం లభించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజంలో నూతనోత్తేజం నెలకొంది. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని యునైటెడ్ కింగ్‌డమ్, ఖతార్, సౌదీ అరేబియా దేశాల్లో ఎన్ఆర్ఐ టీడీపీ విభాగాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. ప్రవాసాంధ్రులు బాణసంచా కాల్చి, కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాతృభూమి పునర్నిర్మాణంలో భాగస్వాములవుతామని ప్రతినబూనారు. అమరావతి రాజధాని చట్టబద్ధమయ్యేందుకు కృషి చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, మద్దతు ఇచ్చిన అన్ని పార్టీల ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పూర్వవైభవం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.**

**కోవెంట్రీ/లీడ్స్ (యూకే):** కోవెంట్రీ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ యూకే తెలుగు యువత ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎన్డీయే ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత సభ్యులు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు. లీడ్స్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ యూకే ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. "జై అమరావతి... జై చంద్రబాబు... జై లోకేష్" అంటూ నినాదాలతో హోరెత్తించారు. తెలుగు యువత తరపున కేంద్ర ప్రభుత్వానికి, పీఎం మోదీకి ధన్యవాదాలు తెలిపారు. లీడ్స్ నగరంలోని టీడీపీ కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ఖతార్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి చట్టబద్ధమైన ఆమోదం పొందిన నేపథ్యంలో టీడీపీ ఎన్ఆర్ఐ ఖతార్ విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఖతార్ అధ్యక్షుడు గోటిపాటి రామనయ్య, మాదినేని అంజనేయులు, యెలమంచిలి శాంతయ్య, దేవినేని శ్రీనివాస్, దాసరి రమేష్, మాగులూరి రవీంద్ర, గాలి కవీంద్ర, అనిల్ మలసాని, నార్నే కళ్యాణ్, రావుల శేషసాయి, షేక్ మహ్మద్ యాసిన్, బొండలపాటి విజయ్, వేణు బాల, గోపాల్ చౌదరి, ఇదుపుగంటి వాసు, హను, కిరణ్, మలిరెడ్డి సత్యనారాయణలతో పాటు తెలుగు ప్రజలు, టీడీపీ కార్యకర్తలు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు చురుగ్గా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా టీడీపీ పతాకాన్ని ఆవిష్కరించారు.

**సౌదీ అరేబియా:** అమరావతి రాజధాని బిల్లుకు చట్టసభల్లో స్థిరత్వం లభించినందుకు ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ ప్రెసిడెంట్ రావి రాధాకృష్ణ, షేక్ సైఫుల్లా సూచనల మేరకు సౌదీ అరేబియా రియాద్‌లోని ప్రవాసాంధ్రులు సంబరాలు జరుపుకున్నారు. సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ వడ్లమూడి సారధి నాయుడు, షేక్ జానీ బాషా, చెన్నుపాటి రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలందరూ "శ్రీరామనవమి వారోత్సవాలు" జరుపుకుంటున్న శుభ సమయంలో అసెంబ్లీ, పార్లమెంటు ఉభయ సభల్లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదించబడటం ఒక శుభపరిణామం అని కొనియాడారు. ముస్లింలు పవిత్రంగా భావించే సౌదీ అరేబియాలోని మక్కా మదీనా నుంచి పవిత్ర జలాన్ని వడ్లమూడి సారధి నాయుడు సేకరించి స్నేహితుల ద్వారా ఆంధ్ర రాష్ట్రానికి పంపించి తన కుటుంబీకుల ద్వారా తిరుపతి జిల్లా చంద్రగిరి ఎంపీడీవోకు చేర్చారన్నారు. 2015 అక్టోబరు 22 విజయదశమి పర్వదినాన ఉద్దండరాయునిపాలెంలో జరిగిన భూమి పూజలో భారతదేశంలోని పవిత్ర నదీ జలాలతో పాటు మక్కా నుంచి తెచ్చిన జలాలనూ వినియోగించారని గుర్తుచేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి బిల్లుకు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన అతి తక్కువ సమయంలోనే ఆమోద ప్రక్రియ పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. దీపాలు వెలిగించి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కృష్ణ ప్రసాద్, చలపతిరావు, దేవరాజులు, సుదర్శన్, నరేష్, చక్రపాణి, రామారావు, చంద్రబాబు, నరసింహులు, తారకేశ్వర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


బహ్రెయిన్‌లో...


సౌదీ అరేబియాలో...


ఖతార్‌లో...

# రక్తదానం... మహాదానం

**కువైట్‌లో గల్ఫ్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం**

**ముందుకు వచ్చిన 122 మంది దాతలు.. 92 మంది రక్తదానం**

**ఏపీఎన్ఆర్టీఎస్, ఎన్ఆర్ఐ టీడీపీ నేతల ప్రశంసల జల్లు**

**కువైట్:** విదేశీ గడ్డపై ఉన్నా మాతృభూమి సంస్కారంతో తోటివారి ప్రాణాలు కాపాడాలనే సంకల్పంతో కువైట్‌లోని ప్రవాసాంధ్రులు సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. కువైట్‌లోని అబ్రకియా ప్రాంతంలో ఉన్న సెంట్రల్ బ్లడ్ బ్యాంక్‌లో గల్ఫ్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది.

వెంకట్ కోడూరి పర్యవేక్షణలో జరిగిన శిబిరానికి సుమారు 122 మంది స్వచ్ఛందంగా ముందుకు రాగా వైద్య పరీక్షల అనంతరం అర్హులైన 92 మంది రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సలహాదారు, ఏపీఎన్ఆర్టీసీ అధ్యక్షుడు రవికుమార్ వేమూరి రక్తదాతలను అభినందిస్తూ సందేశం పంపారు. "రక్తదానం ద్వారా ప్రాణాలను రక్షించడం అత్యంత గొప్ప సేవ. ప్రతి ఒక్కరూ ఇలాంటి మహత్తర కార్యాల్లో భాగస్వాములు కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో గల్ఫ్ దేశాల్లోని తెలుగువారు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, దాతలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ (ఆపరేషన్స్, సర్వీసెస్) నాగేంద్రబాబు అక్కిలి మాట్లాడుతూ విదేశీ గడ్డపై ఉన్నా మాతృభూమిపై ప్రేమతో సామాజిక బాధ్యతతో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోడి నారాయణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి చాపల వెంకటేష్ ముదిరాజ్, ఇతర సభ్యులు మాట్లాడుతూ.. "రక్తదానం-మహాదానం" నినాదంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆదినారాయణ ముదిరాజ్, నల్లబోయిన వెంకట సుబ్బయ్య, బొమ్మబత్తిన రెడ్డియ్య, కడప శ్రీనివాసులు, ధర్మ ముదిరాజ్, పెద్ద సంఖ్యలో ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.







# 'మీట్ ది లీడర్స్' గ్రాండ్ సక్సెస్

## 'టామా' ఆధ్వర్యంలో నిర్వహణ... విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన నిపుణులు

**అట్లాంటా:** మెట్రో అట్లాంటా తెలుగు అసోసియేషన్ (TAMA) ఆధ్వర్యంలో యువత, హైస్కూల్ విద్యార్థుల కోసం మొట్టమొదటిసారిగా నిర్వహించిన 'మీట్ ది లీడర్స్' కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. విద్యార్థులకు భవిష్యత్తుపై దిశానిర్దేశం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ సెషన్‌కు విశేష స్పందన లభించింది.

ప్రముఖుల స్ఫూర్తిదాయక ప్రసంగాలు: ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు తమ జీవిత ప్రయాణాలను, ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులతో పంచుకున్నారు

నీరా బాల్: న్యాయ వ్యవస్థలో ఉన్నత శిఖరాలను అధిరోహించే మార్గాలను వివరించారు.

హరి చౌళ్ల (Fuel Daddy సహ వ్యవస్థాపకులు): ఎంట్రప్రెన్యూర్‌షిప్‌లో మెళకువలు, వ్యాపార రంగంలో రాణించే విధానంపై అవగాహన కల్పించారు.

హవిశ్రీకిత్ ఆర్య (లా స్టూడెంట్): లా స్కూల్ జీవితం, న్యాయ విద్య ప్రాముఖ్యతను వివరించారు.

కార్యక్రమ నిర్వహణకు సహకరించిన సాయికి, నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తున్న సుజాత పి తోటకి 'టామా' ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సెషన్‌కు మోడరేటర్‌గా వ్యవహరించిన 10వ తరగతి విద్యార్థిని బెబో... ఆత్మవిశ్వాసంతో, సమయస్ఫూర్తితో కార్యక్రమాన్ని నడిపించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరు కావడంతో ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా 'టామా' అధ్యక్షురాలు సునీత పొట్లూరి మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ సెషన్ ద్వారా ఎంతో స్ఫూర్తి పొందారని, యువత ఎదుగుదలకు తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని ప్రకటించారు.





'మాటా' ఆధ్వర్యంలో న్యూజెర్సీలో 11న

# చదరంగం పోటీలు

**ఎడిసన్:** మన అమెరికా తెలుగు సంఘం (MATA) ఆధ్వర్యంలో అగ్రరాజ్యంలో వరుస కార్యక్రమాలతో తెలుగు కమ్యూనిటీ సందడి మొదలైంది. ఇందులో భాగంగా న్యూజెర్సీలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చదరంగం పోటీలను నిర్వహించడంతో పాటు జూన్ నెలలో అత్యంత భారీ స్థాయిలో 'మాటా 2వ మహాసభల' నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు.




న్యూజెర్సీలోని ఎడిసన్ నగరంలో గల స్వరాజ్ టీవీ కార్యాలయంలో ఏప్రిల్ 11న విద్యార్థుల కోసం అన్‌రేటెడ్ చెస్ పోటీలు జరగనున్నాయి. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఇందులో పాల్గొనవచ్చు. 5-రౌండ్ స్విస్ సిస్టమ్ విధానంలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు జూన్‌లో జరిగే కన్వెన్షన్‌లో ప్రతిష్టాత్మక ట్రోఫీల కోసం పోటీపడే అవకాశం పొందుతారు.

**జూన్ 19, 20 తేదీల్లో 'మాటా' 2వ మహాసభలు:**

ఈ ఏడాది జూన్ 19, 20 తేదీల్లో పెన్సిల్వేనియాలోని ఓక్స్ నగరంలో ఉన్న 'ది గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్' వేదికగా మాటా 2వ మహాసభలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు, వ్యాపార, సాహిత్య సెషన్లు ఉంటాయి.

నిర్వాహక బృందం: ఈ రెండు కార్యక్రమాల విజయవంతం కోసం 'మాటా' కార్యవర్గ సభ్యులు.

ప్రెసిడెంట్: రమణ కె.కిరణ్ దుగ్గిగి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్: ప్రవీణ్ గూడూరు, జనరల్ సెక్రటరీ: విజయ్ భాస్కర్ కలాల్, ట్రెజరర్: శ్రీధర్ గూడాల, నేషనల్ కో-ఆర్డినేటర్: టోనీ జెన్న, స్పోర్ట్స్ డైరెక్టర్: సురేష్ ఖజానా (646-707-6798). వీరితో పాటు స్వాతి అట్లూరి, కళ్యాణి బెల్లంకొండ, మహేందర్ నరాల, నాగేష్ చిలకపాటి తదితర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు www.mata-us.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. (లేదా) హెల్ప్‌లైన్ నంబర్ +1 888-7MATAUSను సంప్రదించవచ్చు.

షికాగాలో 12న

# మహా మాయ నృత్య రూపకం

**షికాగో:** షికాగో ఆంధ్ర అసోసియేషన్ (CAA) ఆధ్వర్యంలో 'ఆచార్య పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ' సమర్పణలో "మహా మాయ-ఎ డివైన్ ఎనర్జీ" అనే భారీ నృత్య రూపక ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ నృత్య రూపకాన్ని గురు విదుషి ఆశా అదిగ ఆచార్య విజువలైజ్ చేసి దర్శకత్వం వహించారు.





వేదిక: బోలింగ్‌బ్రూక్ హైస్కూల్ (Bolingbrook High School), 365 రైడర్ వే, బోలింగ్‌బ్రూక్, IL 60440.

భక్తి, కళాత్మకత మేళవింపుగా సాగే ఈ 'గ్రాండ్ డాన్స్ డ్రామా'లో అనేక మంది కళాకారులు పాల్గొననున్నారు. అమ్మవారి దివ్య శక్తిని చాటిచెప్పేలా ఈ ప్రదర్శన ఉండబోతోంది. షికాగోలోని తెలుగు వారు, కళాభిమానులు హాజరై ప్రదర్శనను తిలకించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# తెలుగు సాహితీ సౌరభం 'కౌముది'

## 31వ సాహిత్య పోటీల ఫలితాలు విడుదల




**అమెరికా/హైదరాబాద్:** తెలుగు సాహితీ లోకంలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ అంతర్జాల పత్రిక 'కౌముది' (Kaumudi.net) శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని నిర్వహించిన 31వ ఉత్తమ రచనల పోటీ ఫలితాలను వెల్లడించింది. ఇందులో విజేతలుగా నిలిచిన ఉత్తమ కథలు, కవితలను కౌముది ఏప్రిల్ మాసపు ప్రత్యేక సంచికలో ప్రచురించింది.

ప్రధాన విభాగంతో పాటు, "మొట్టమొదటి రచన", "యువతరం" వంటి ప్రత్యేక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన రచయితల రచనలకు ఈ సంచికలో పెద్దపీట వేశారు. వైవిధ్యమైన కథా వస్తువులు, లోతైన భావజాలం ఉన్న కవితలతో ఈసారి పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి.

తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ కొత్త నీరు లాంటి రచయితలను ఆదరిస్తున్న 'కౌముది' సంపాదకులు కిరణ్ ప్రభ, నిర్వహణా బాధ్యులు క్రాంతిలకు రచయితలు, పాఠకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రస్తుతం కౌముది వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఈ కథలను, కవితలను చదివి, మీ విలువైన అభిప్రాయాలను పంచుకోవాలని సాహితీ అభిమానులను నిర్వాహకులు కోరారు. తెలుగు సాహిత్యంలో వస్తున్న కొత్త తరహా సృజనాత్మకతను ఆస్వాదించడానికి ఇదొక చక్కని వేదిక అని వారు పేర్కొన్నారు.

సంచిక కావాలంటే కింది లింక్ క్లిక్ చేయండి https://www.koumudi.net/Monthly/2026/april/index.html

'టాటా' మహిళా విభాగం ఆధ్వర్యంలో

# కుట్టు శిక్షణ వర్క్ షాప్

**కరోలినా:** నార్త్ కరోలినాలోని ట్రయాంగిల్ ఏరియా తెలుగు అసోసియేషన్ (TATA) మహిళా విభాగం కుట్టుపనిలో ప్రాథమిక అవగాహన కల్పించేందుకు శైలజ సవరం ఆధ్వర్యంలో 'బేసిక్ స్వియింగ్ మెషిన్ ఇంట్రడక్షన్ క్లాస్' నిర్వహించనుంది. ఇందులో మిషన్ ఎలా వాడాలి, ప్రాథమిక కుట్లు, జాగ్రత్తలను వివరిస్తారు.

తేదీ: ఏప్రిల్ 18, శనివారం

సమయం: మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు

వేదిక: 140 మోరిస్‌విల్లే స్క్వేర్ వే, మోరిస్‌విల్లే.

కేవలం టాటా మహిళా సభ్యులకు మాత్రమే.

టాటా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్-2026 (కార్యవర్గ సభ్యులు): అధ్యక్షుడు: వినోద్ కుమార్ కట్రగుంట, ఉపాధ్యక్షుడు: నాగ గంధి, కార్యదర్శి: వెంకట్ కోగంటి, కోశాధికారి, టాటా మహిళా: హేమ దాసరి, జాయింట్ సెక్రటరీ, తెలుగు బడి: సాయిమహేష్ గడ్డంశెట్టి, క్రీడలు: వెంకట నరేష్ మొక్క, సభ్యత్వం: ప్రవీణ్ పెద్ది, ఆహారం, లాజిస్టిక్స్: సాయి శ్రీకాంత్ ఉప్పలపాటి, లాజిస్టిక్స్, చేయూత: భూమేష్ గండే, సాంస్కృతిక, సాహిత్య వేదిక: శివ బొనగిరి, టాటా యువ: గణేష్ మంత్రిప్రగడ... కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు.

ఆసక్తి గల మహిళలు త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు హేమ దాసరిని 9197607434 నెంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# మా పాలనామంత్రం.. పౌరులే దేవుళ్లు!

## కర్మయోగి సాధనా వారోత్సవంలో ప్రధాని మోదీ



తమ ప్రభుత్వం 'పౌరులే దేవుళ్లు' (నాగరిక్ దేవో భవ) అనే ప్రధానమైన పాలనా మంత్రంతో పని చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా భారత్ దూసుకెళ్తోందని, ఈ తరుణంలో ప్రజలకు అందించే సేవలను ఎప్పటికప్పుడు ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ లక్ష్యంతోనే పౌరులే కేంద్రంగా ప్రజా సర్వీసులను తమ సర్కారు విస్తరిస్తోందన్నారు. ఢిల్లీలో 'కర్మయోగి సాధనా వారోత్సవం 2026' ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు యావత్ దేశంలోని అన్ని స్థాయిల సివిల్ సర్వెంట్లు పౌర కేంద్రక ప్రజా సర్వీసులనే అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పని సామర్థ్యాన్ని పెంచేందుకు కర్మయోగి సాధనా వారోత్సవం దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రజా సర్వీసులను మరింత మెరుగ్గా మార్చడానికి, ప్రజలకు ఉపయోగకరంగా మలచడానికి నిత్యం తమ ప్రభుత్వం శ్రమిస్తోందని వెల్లడించారు.

# నా నోరు నొక్కేసినా.. నిజం దాగదు!

## ఆప్ అధిష్ఠానం తీరుపై ఎంపీ రాఘవ్‌చద్దా ధ్వజం



రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పార్టీ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు.

"పార్లమెంట్లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా? నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే... అది ఆక్ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా" అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆర్ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిట్టల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.



తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తోన్న విషయం తెలిసిందే.

# విజయ్ ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు

పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ వేయగా.. ఇందుకు సంబంధించి విజయ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయ పరిశీలనకు దారితీయవచ్చని పలువురు అంటున్నారు.పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు విరుద్ధంగా ఉన్నట్లు సమాచారం. పెరంబూర్లో ఇచ్చిన అఫిడవిట్లో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్నట్లు తెలిసింది. అదే తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పెండింగ్లో రెండు ఎస్ఐఆర్లు ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం..మరోవైపు, ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతా తెరిచామని, ఇందులో రూ.లక్ష రూపాయలు ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్లో పేర్కొనగా.. తిరుచ్చి అఫిడవిట్లో మాత్రం రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని పేర్కొన్నట్లు తెలిసింది. అయితే, ఇలా ఎన్నికల అఫిడవిట్ లో వాస్తవాలు దాచిపెట్టడం లేదా తప్పుగా పేర్కొనడం ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తీవ్రమైన ఉల్లంఘన కిందకే వస్తుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే అస్సాంలో అక్రమ చొరబాట్లు


## కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శ



అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అస్సాంలో అక్రమ చొరబాట్లను ప్రోత్సహించాయని భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. అస్సాం స్థానిక ముస్లింలకు భాజపా వ్యతిరేకం కాదన్నారు. తాము వ్యతిరేకిస్తోంది చొరబాటుదార్లను మాత్రమేనని పేర్కొన్నారు. అస్సాం గణపరిషత్ (ఏజీపీ)కు చెందిన కేశబ్ మహంతా తరపున గురువారం కాలియాబోర్లో నిర్వహించిన ఎన్నికల సభలో అమిత్ షా ప్రసంగించారు. భాజపా, ఏజీపీ ఎన్నికల పొత్తును సూర్యచంద్రులతో పోల్చారు. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు చెదిరిపోవాలన్న పగటి కలలను రాహుల్ గాంధీ విరమించుకోవాలంటూ చురకలు వేశారు. ప్రపంచ ప్రసిద్ధ కాజీరంగా జాతీయ పార్కును చొరబాటుదార్లకు అప్పగించారంటూ కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తారు. ఎన్డీఏ ప్రభుత్వం అక్రమ చొరబాటుదారులను, ఆక్రమణదారులను అక్కడి నుంచి ఖాళీ చేయించిందని అమిత్ షా తెలిపారు. ఈ చర్యను సాకుగా చూపి ప్రజల మధ్య విభేదాలు సృష్టించాలని కాంగ్రెస్ నేతలు యత్నిస్తున్నారని ఆరోపించారు.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

## కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి



దేశంలో గ్యాస్ కొరత లేదని, పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా తలెత్తే ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. కేరళలోని తిరువనంతపురంలో గురువారం జరిగిన 'సైనిక్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "సముద్ర వాణిజ్యానికి అత్యంత కీలక మార్గమైన హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న భారత చమురు నౌకలకు మన నౌకాదళం రక్షణ కల్పిస్తోంది. పశ్చిమాసియాలో పరిస్థితులను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగు దేశమైన పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే భారత్ ప్రతిస్పందన ఊహించనిరీతిలో నిర్ణయాత్మకంగా ఉంటుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా ఉగ్రదాడులు జరిగాయి. వాటి పై ఆ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎన్డీయే ప్రభుత్వం ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటోంది" అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## 16న పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాలు

పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 16కు వాయిదాపడ్డాయి. వాస్తవంగా పార్లమెంటును నిరవధికంగా వాయిదావేయాల్సి ఉంది. దానికి భిన్నమైన అసాధారణ మార్పుపై లోక్సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రకటనలు చేశారు. ఆ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు, శూన్యగంట, ప్రైవేటు బిల్లులు వంటివి ఉండవని స్పీకర్ స్పష్టంచేశారు. లోక్సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది.






# భారత్ నౌకాదళంలోకి మరో బ్రహ్మాస్త్రం

## విశాఖ తీరంలో ఐఎన్ఎస్ తారాగిరి జల ప్రవేశం

భారత నౌకాదళ అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికి పైగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/ గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-3 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.



# నెలవంక కాదు.. భూమి

**ఆర్టెమిస్-2 అద్భుత దృశ్యాలు**

చంద్రుడి వద్దకు మానవులను పంపేందుకు ఉద్దేశించిన 'ఆర్టెమిస్-2'ను అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రయోగించిన సంగతి తెలిసిందే. జాబిల్లి దిశగా ఇది చేస్తోన్న ప్రయాణంలో తీసిన అద్భుత దృశ్యాలను నాసా షేర్ చేసింది. ఆ చిత్రాల్లో భూమి నెలవంకలా దర్శనమిచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌నుంచి నలుగురు వ్యోమగాములతో కూడిన ఓరియన్ క్యాప్సూల్ జాబిల్లి వైపు దూసుకెళ్తుంది. ఇది చంద్రుడి ఉపరితలానికి అత్యంత సమీపంగా వెళ్లి, దానిని చుట్టి రానుంది. ఈ మిషన్ సమయం పది రోజులు. ఇక, ప్రయోగం జరిగిన కొద్దిగంటలకే ఓరియన్లోని సోలార్ అరే కెమెరా అంతరిక్షం నుంచి పుడమి చిత్రాలను తీసింది. వాటిల్లో భూమి నెలవంకలా ఆవిష్కృతమైంది. ఆర్టెమిస్-2 యాత్రలో ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడా వాసి భాగస్వాములయ్యారు. వీళ్లంతా చందమామపై కాలు మోపకుండా.. సుదూరం నుంచే జాబిల్లిని చుట్టి వస్తారు. జాబిల్లి యాత్రకు నిర్దేశించిన రాకెట్, వ్యోమనౌకలోని కీలక వ్యవస్థల పనితీరును మదించడమే ఈ మిషన్ ఉద్దేశం.

# గమ్యం మార్చుకున్న 'పింగ్ షున్'

## భారత్‌కు చేరాల్సిన ఇరాన్ చమురు చైనాకు మళ్లింపు

భారత్‌కు రావాల్సిన ఇరాన్ ముడి చమురు ట్యాంకర్ 'పింగ్ షున్' తన గమ్యస్థానాన్ని మార్చుకొని చైనావైపు వెళ్తున్నట్లు షిప్ ట్రాకింగ్ వెబ్‌సైట్ కెప్లర్ పేర్కొంది. ఈనెల 4న గుజరాత్‌లోని వడినార్ నౌకాశ్రయానికి ఇది చేరుకోవాల్సి ఉంది. తాజాగా అది చైనాలోని డోగియింగ్‌కు వెళ్తున్నట్టు సంకేతాలు చూపిస్తున్నట్టు తెలిపింది. అయితే ఈ నౌక తన గమ్యస్థానానికి వెళ్లే దారులను మార్చుకొని ఉండే అవకాశం కూడా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. మార్చి 4న ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్‌లోకి చమురు లోడింగ్ చేశారని.. ఇందులో దాదాపు 6,00,000 బ్యారెళ్ల చమురు ఉండొచ్చని కెప్లర్ తెలిపింది.



ఈ సమయంలో ఇరాన్ చమురు నౌక అనూహ్యంగా చైనావైపు మళ్లడం గమనార్హం. గతంలో భారత్.. ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 11.5 శాతంగా ఉండేది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా.. మే 2019నాటికి అది రోజుకు 2,68,000 బ్యారెళ్లకు తగ్గింది. తర్వాత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఆ దేశంనుంచి చమురు దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో చమురు ధరలు తగ్గిద్దామన్న ఉద్దేశంతో ఇరాన్ చమురు కొనుగోళ్లపై ఆంక్షలను అగ్రరాజ్యం తాత్కాలికంగా (30 రోజుల పాటు) ఎత్తివేసింది. దీంతో 2019 తర్వాత మొదటిసారి ఇరాన్ నౌక భారత్‌వైపు బయల్దేరినట్టు డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ఇటీవల తెలిపింది.



### ఇరాన్ నిర్దేశించిన కారిడార్ కాకుండా

# ఇతర మార్గంలో ఓమన్ నౌకలు

*హర్మూజ్ జలసంధి వద్ద నౌకాయానానికి చిరు ఆశ కనిపిస్తోంది. తాజాగా ఒమన్ తీరానికి అత్యంత సమీపం నుంచి మూడు నౌకలు హర్మూజ్‌లోకి ప్రవేశించాయి. హర్మూజ్ నిర్వహణకు సంబంధించిన ప్రొటోకాల్‌పై ఇరాన్, ఒమన్ల మధ్య చర్చలు జరుగుతున్నట్టు వార్తలు వెలువడుతున్న క్రమంలో.. ఈ పరిణామం కీలకంగా మారింది.*

*మీడియా కథనాల ప్రకారం.. మూడు నౌకలు గురువారం ఇరాన్ నియంత్రణలో ఉన్న మార్గంలో కాకుండా.. ఒమన్ తీరానికి అత్యంత సమీపంలో ప్రయాణించి హర్మూజ్‌లోకి ప్రవేశించాయి. రెండు అతిపెద్ద ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎన్ఎన్ఎ క్యారియర్ కలిగిన ఈ నౌకలు ఒమన్‌కు చెందినవి. ఆ చమురు ట్యాంకర్లలో ఒక్కొక్క దానిలో సుమారు 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రవాణా అవుతుండగా.. ఎల్ఎన్ఎ క్యారియర్ ఖాళీగా ఉన్నట్టు తెలుస్తోంది.*

*ట్యాంకర్ ట్రాకర్స్ ప్రకారం.. గత నెలలో హర్మూజ్ జలసంధి మీదుగా ఒక్క ఎల్ఎన్ఎ క్యారియర్ కూడా ప్రయాణించలేదు. దీంతో యుద్ధం ప్రారంభమైన తర్వాత గల్ఫ్‌నుంచి బయటకు వెళ్లిన తొలి ఎల్ఎ క్యారియర్ ఇదే. కాగా.. ఆ చమురు నౌకల్లో ఒకటి సౌదీ అరేబియా నుంచి మరొకటి అబుధాబి నుంచి బయలుదేరింది.*

*హర్మూజ్ జలసంధి పర్యవేక్షణకు సంబంధించి ఒమన్‌తో కలిసి ఒక ప్రతిపాదనను రూపొందిస్తున్నట్టు ఇరాన్ దౌత్యవేత్త ఖాజమ్ ఘరీబాబాద్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన చివరి దశలో ఉందని, త్వరలోనే తాము ఒమన్‌తో చర్చలు జరుపుతామని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.*

### ఆ యురేనియం కోసం

# ఏకంగా రన్‌వే నిర్మాణం

**ట్రంప్ చేతికి అగ్రరాజ్య సైన్యం ప్రణాళిక**

ఇరాన్ వద్ద ఉన్న సుమారు 450 కిలోల యురేనియంపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన ప్లాన్‌ను ఇటీవల అగ్రరాజ్య సైన్యం ట్రంప్ చేతికి ఇచ్చినట్టు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ యురేనియంను తరలించడం చాలా క్లిష్టమైన ప్రక్రియ అని, ఇందుకోసం ప్రత్యేకంగా రన్‌వేను నిర్మించాల్సిన అవసరం ఉందని అమెరికా మిలిటరీ వెల్లడించినట్లు సమాచారం.

ఇరాన్ అణుస్థావరాలే లక్ష్యంగా గతేడాది అమెరికా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో ఇస్ఫహాన్, నతాంజ్ అణుక్షేత్రాలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాతనుంచి ఇరాన్ వద్ద ఉన్న 450 కిలోల యురేనియం ఆచూకీ గల్లంతైంది. 60శాతం శుద్ధి చేసిన ఈ యురేనియం అణుస్థావరాల శిథిలాల కింద ఉండొచ్చని అమెరికా విశ్వసిస్తోంది. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు టెహ్రాన్‌తో చర్చలు జరపాలని భావిస్తోంది. ఒకవేళ ఇరాన్ అందుకు అంగీకరించకపోతే.. బలవంతంగానైనా దాన్ని తరలించేందుకు ఆపరేషన్ చేపట్టాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే అమెరికా సైన్యం ఓ మిలిటరీ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ రేడియో ధార్మిక పదార్థాన్ని తరలించాలంటే వేలాదిమంది ప్రత్యేక శిక్షణ కలిగిన సైనికులను ఇరాన్‌కు తరలించాల్సి ఉంటుంది. యురేనియం తవ్వకం కోసం పరికరాలను కూడా వాయుమార్గంలో తీసుకురావాలి. దాన్ని వెలికితీసిన తర్వాత కార్గో విమానాల్లో ఇరాన్ వెలుపలికి తరలించాలని అమెరికా సైన్యం ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం నతాంజ్‌వంటి అణుస్థావరాల వద్ద రన్వే నిర్మించాల్సిన అవసరం ఉంటుందని తెలిపింది.

అయితే, ఇలాంటి ఆపరేషన్లు సైనికులకు అత్యంత ప్రమాదంతో కూడుకున్నవని, వీటిని నిర్వహించేందుకు కొన్ని వారాల సమయం పట్టొచ్చని అణు, రక్షణరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది సాధ్యమే అయినా, కాల్పుల విరమణ ఒప్పందం కింద ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ సిబ్బంది సాయంతో దీన్ని వెలికితీస్తే మంచిదని అమెరికా రిటైర్డ్ జనరల్ ఒకరు అభిప్రాయపడ్డారు.

ఈ ఆపరేషన్‌లో కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా జరగొచ్చని హెచ్చరించారు. కాగా.. ఈ మిలిటరీ ప్లాన్‌పై వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కరోలిన్ లివిట్ స్పందించారు. కేవలం ప్రణాళిక మాత్రమే అమెరికా అధ్యక్షుడి వద్దకు వెళ్లిందని, దానర్థం ఆ ఆపరేషన్‌పై ఆయన నిర్ణయం తీసుకున్నట్టు కాదని తెలిపారు. ఇరాన్‌లో ఇంకా విధ్వంసం మొదలుకాలేదని, రానున్న వారాల్లో అత్యంత భీకర దాడులు ఉంటాయని ట్రంప్ ఇటీవల బెదిరించిన సంగతి తెలిసిందే.

### ఇంకో ఎఫ్-35ని

# కూల్చేశాం: ఇరాన్



అమెరికా వాయుసేనకు చెందిన అధునాతన ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను తమ గగనతలంలో కూల్చేశామని ఇరాన్ వెల్లడించింది. తాజా ప్రకటనపరంగా చూసుకుంటే.. ఇరాన్ సైన్యం చేతిలో కూలిన ఎఫ్-35ల సంఖ్య రెండుకు చేరింది. ఈ ఘటనలో పైలట్ గాయపడ్డాడని, బతికిఉండే అవకాశాలు తక్కువని పేర్కొంది. ఇరాన్ ప్రకటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) నుంచి ఎలాంటి ధ్రువీకరణ రాలేదు. ఎఫ్-35పై ఇరాన్ ప్రకటన నిజమేనని తేలితే.. అది అమెరికాకు భారీ నష్టమనే అవుతుంది. అమెరికా అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే విమానాల్లో ఎఫ్-35 యుద్ధవిమానం ఒకటి. ఈ యుద్ధంలోనే తొలిసారి శత్రువుల చేతిలో దాడికి గురైనట్టు వార్తలు వస్తున్నాయి. ఎఫ్-35 లైటనింగ్ -2.. అమెరికా, దాని మిత్రపక్షాల వాయుసేనలకు వెన్నెముక లాంటిది. ఈ అధునాతన స్టెల్త్ జెట్ ఖరీదు 10 కోట్ల డాలర్లు పైనే. 19 దేశాలు దీన్ని కలిగిఉన్నాయి. విస్తృతస్థాయిలో వినియోగంలో ఉన్న ఐదోతరం యుద్ధ విమానం ఇదొక్కటే. దీనికి స్టెల్త్, సెన్సర్ సంధానత, నెట్ వర్కింగ్ కీలకం.

**జపాన్‌కు తోమహాక్‌లు ఆలస్యం..!**

వందల సంఖ్యలో తోమహాక్ క్షిపణుల కొనుగోలు కోసం అమెరికాతో జపాన్ గతంలో ఒప్పందం చేసుకుంది. దానిప్రకారం జరగాల్సిన క్షిపణుల డెలివరీ ఆలస్యమవుతోంది. ఇరాన్ యుద్ధంవల్ల అవి తరిగిపోతున్నాయని ఇప్పటికే అమెరికాలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం క్షిపణుల డెలివరీ ఆలస్యానికి అదే కారణమని తెలుస్తోంది.

### చైనా భారీ రాకెట్

# ప్రయోగం విఫలం



వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనా శాస్త్రవేత్తలకు ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేటుగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన తియాన్‌లాంగ్-3 రాకెట్ ప్రయోగం విఫలమైంది. సాంకేతిక సమస్య కారణంగానే నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లలేకపోయినట్టు సంబంధిత సంస్థ వెల్లడించింది. బీజింగ్‌కు చెందిన స్పేస్ పయనీర్ అనే ప్రైవేటు సంస్థ.. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9కు పోటీగా భారీ రాకెట్‌ను అభివృద్ధి చేసింది. దీనిని ఏప్రిల్ 3న డాంగ్ఫెంగ్ కమర్షియల్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ కేంద్రం నుంచి ప్రయోగించింది. నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే అది విఫలమైంది. ఇందుకుగల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని స్పేస్ పయనీర్ వెల్లడించింది. ఈ సందర్భంగా భాగస్వామ్య పక్షాలకు క్షమాపణ చెబుతున్నామని, తదుపరి మిషన్లు విజయవంతమయ్యేలా కృషి చేస్తామని ఓ ప్రకటనలో తెలిపింది.




# చెన్నై కోటలో పంజాబ్ పంజా

**- 210 పరుగుల భారీ లక్ష్యాన్ని ఊదిపారేసిన అయ్యర్ సేన**

**- ప్రియాన్ష్ ఆర్య 'ఇంపాక్ట్' ఇన్నింగ్స్.. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ మార్క్!**

**- సొంత గడ్డపై చెన్నైకి తప్పని నిరాశ**

ఐపీఎల్ 19వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ విజయ పరంపర కొనసాగిస్తోంది. తొలి పోరులో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించిన పంజాబ్ ఈసారి ఏకంగా ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్‌ను వారి సొంత గడ్డపైనే చిత్తు చేసింది. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి పంజాబ్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

**పంజాబ్ 'ఇంపాక్ట్': ప్రియాన్ష్, అయ్యర్ వీరవిహారం!**

210 పరుగుల భారీ ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఏమాత్రం తడబడలేదు. 'ఇంపాక్ట్ సబ్'గా వచ్చిన ప్రియాన్ష్ ఆర్య (39) ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఖలీల్ అహ్మద్, మ్యాట్ హెన్రీ బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ పంజాబ్ స్కోరు బోర్డును ఉరికించాడు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (43)తో కలిసి తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివర్లో మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్ లాంఛనాన్ని పూర్తి చేయడంతో పంజాబ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

**సీఎస్‌కే కుర్రాళ్ల పోరాటం వృథా:**

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోరు సాధించింది.

యువ సంచలనం ఆయుష్ మాత్రే (73) అద్భుతమైన హాఫ్ సెంచరీతో చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాడు. అతనికి తోడుగా శివమ్ దూబే (45 నాటౌట్) చివర్లో బౌండరీల వర్షం కురిపించడంతో సీఎస్‌కే 200 మార్కును దాటింది. అయితే బౌలర్లు పంజాబ్ బ్యాటర్లను కట్టడి చేయడంలో విఫలం కావడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు.

# వాంఖడే స్టేడియంలో 'లవ్ స్టోరీ'

**కేకేఆర్ గర్ల్ ఫ్రెండ్‌కి ప్రపోజ్ చేసిన ముంబై ఫ్యాన్**

ఐపీఎల్ మ్యాచ్‌లు కేవలం ఉత్కంఠకే కాదు... అప్పుడప్పుడు కొన్ని అందమైన, ఆసక్తికరమైన సంఘటనలకు కూడా వేదికగా మారుతుంటాయి. మ్యాచ్ మధ్యలో తమ భాగస్వాములకు ప్రేమను వ్యక్తపరుస్తూ స్టేడియంలో ప్రపోజ్ చేయడం ఈమధ్య కాలంలో ఒక ట్రెండ్‌గా మారింది. అయితే ఇలాంటి ఒక రొమాంటిక్ ప్రయత్నం చేసిన ఓ క్రికెట్ అభిమానికి మాత్రం వింత అనుభవం ఎదురైంది.

ముంబై వర్సెస్ కేకేఆర్ మ్యాచ్‌లో..

ముంబైలోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఈ క్యూట్ ఘటన చోటుచేసుకుంది. గ్యాలరీలో కూర్చుని మ్యాచ్ వీక్షిస్తున్న ఓ యువకుడు తన స్నేహితురాలికి జీవితకాల జ్ఞాపకంగా మిగిలిపోయేలా స్టేడియంలోనే ప్రపోజ్ చేయాలని ప్లాన్ చేసుకున్నాడు. ఆ యువకుడు ముంబై ఇండియన్స్ అభిమాని కాగా అతడి స్నేహితురాలు కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్యాన్ కావడం గమనార్హం.

జారిన ఉంగరం.. పెరిగిన టెన్షన్!

ప్లాన్ ప్రకారం అంతా సిద్ధం చేసుకున్న ఆ యువకుడు తన జేబులోంచి ఖరీదైన ఉంగరాన్ని తీసి ఆమెకు ప్రపోజ్ చేయబోయాడు. సరిగ్గా అదే సమయంలో ఊహించని ట్విస్ట్ ఎదురైంది. చేతిలోని ఉంగరం కాస్తా ప్రమాదవశాత్తూ జారిపోయి అక్కడున్న కుర్చీల మధ్యలో పడిపోయింది. దీంతో ఆ యువకుడి టెన్షన్ మామూలుగా లేదు. పక్కనే ఉన్న తోటి ప్రేక్షకులు కూడా ఆ ఉంగరం కోసం కుర్చీల కింద, ఇరుకు సందుల్లో వెతకడం మొదలుపెట్టారు.



ఎట్టకేలకు దొరకడంతో..

కొద్దిసేపు అక్కడ తీవ్ర గందరగోళం, ఉత్కంఠ నెలకొంది. చివరకు అందరూ కలిసి వెతకగా ఉంగరం దొరికింది. దాంతో ఆ యువకుడు ఊపిరి పీల్చుకున్నాడు. వెంటనే మోకాళ్లపై కూర్చొని తన ప్రియురాలికి ప్రపోజ్ చేసి సర్ప్రైజ్ చేశాడు. ఆమె కూడా ఆనందంగా దానికి అంగీకరించింది. ఈ క్యూట్ అండ్ టెన్షన్ మూమెంట్‌ను పక్కనే ఉన్న కొందరు మొబైల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.




# ఐపీఎల్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్!

**94కు పెరగనున్న మ్యాచ్‌ల సంఖ్య**

*ముంబై: ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ (ఐపీఎల్) మరింత విస్తరించనుంది. భవిష్యత్తులో ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ కీలక ప్రకటన చేశారు.*

*ఇటీవల ఒక స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన లీగ్ విస్తరణపై స్పష్టతనిచ్చారు. టీ20 క్రికెట్‌కు ఉన్న ఆదరణ దృష్ట్యా ఐపీఎల్‌ను మరింత భారీగా నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఫార్మాట్‌లో మ్యాచ్‌ల సంఖ్య 94కు చేరితే ప్రతి జట్టు ఇతర జట్లతో రెండేసి మ్యాచ్‌లు (హోమ్ అండ్ అవే పద్ధతిలో) ఆడే అవకాశం లభిస్తుంది.*

*ద్వైపాక్షిక సిరీస్‌ల ప్రభావం: ప్రస్తుతం అభిమానులు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్‌ల కంటే లీగ్ క్రికెట్‌పైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని ఆయన విశ్లేషించారు. అందుకే ఆస్ట్రేలియా (బిగ్ బాష్), ఇంగ్లాండ్ (ది హండ్రెడ్), సౌత్ ఆఫ్రికా (SA20) వంటి దేశాలు సొంత లీగ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయని గుర్తు చేశారు.*

*ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం... ప్రతి జట్టు కొన్ని జట్లతో రెండుసార్లు, మరికొన్ని జట్లతో ఒక్కోసారి మాత్రమే తలపడుతోంది. ఒకవేళ మ్యాచ్‌ల సంఖ్య 94కు పెరిగితే... లీగ్ దశలో ప్రతి జట్టు కనీసం 18 మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుంది. తద్వారా టోర్నీ కాలపరిమితి పెరగడమే కాకుండా బ్రాండ్ వాల్యూ, రెవెన్యూ కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది.*

**వీడియో కాల్ వద్దు..**

# ఇంటికే రా అన్నాడు!

**రోహిత్ శర్మపై 'పెద్ద మనసు'పై ఆయుష్ మాత్రే ఎమోషనల్**



ముంబై: మైదానంలో సిక్సర్ల వర్షం కురిపించే 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ బయట ఎంతటి సున్నిత మనస్కుడో మరోసారి నిరూపితమైంది. తనను ఆరాధించే ఒక యువ క్రికెటర్ కోసం ఆయన కేటాయించిన సమయం, చూపిన ఆదరణ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్న యువ సంచలనం ఆయుష్ మాత్రే... తన రోల్ మోడల్ రోహిత్ శర్మను కలిసినప్పటి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ఆ విశేషాలివిగో....

మెసేజ్ చేయగానే రియాక్షన్: "నేను రోహిత్ భాయ్‌ని కలవాలని మెసేజ్ చేశాను. కానీ ఆయన ఏకంగా నాకే ఫోన్ చేస్తారని ఊహించలేదు. 'సరే.. నువ్వేం చెప్పాలనుకుంటున్నావో మాట్లాడు' అని ఎంతో సాదాసీదాగా అడిగారు" అని మాత్రే గుర్తు చేసుకున్నాడు.

విరార్ టూ ముంబై.. రోహిత్ ఆశ్చర్యం: ఆయుష్ మాత్రే విరార్ (ముంబై శివార్ల)లో ఉంటాడని తెలియగానే రోహిత్ ఆశ్చర్యపోయారట. "అంత దూరం నుంచి రావడం ఎందుకు? మనం వీడియో కాల్‌లోనే మాట్లాడుకుందాం" అని రోహిత్ సూచించినా... ఆయుష్ మాత్రం నేరుగా కలవాలని పట్టుబట్టాడు.

అడ్రస్ పంపి.. ఆహ్వానించి: ఆయుష్ కోరిక మేరకు రోహిత్ తన ఇంటి అడ్రస్ పంపారు. మరుసటి రోజు వెళ్లిన ఆయుష్‌తో దాదాపు రెండు గంటల పాటు ఏమాత్రం విసుగు లేకుండా ముచ్చటించారు. ఒక స్టార్ క్రికెటర్ తనలాంటి యువ ఆటగాడికి అంత సమయం ఇవ్వడం ఆయుష్‌ను మంత్రముగ్ధుడిని చేసింది. "నా ఆరాధ్య దైవాన్ని కలవడం నా జీవితకాల స్వప్నం. ఆ రెండు గంటలు ఎలా గడిచాయో కూడా తెలియలేదు. నా కళ్లముందే నా కల నెరవేరినట్లు అనిపించింది." అన్నాడు ఆయుష్ మాత్రే

**అహ్మదాబాద్‌ను తలదన్నేలా..**


# ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం నిర్మాణానికి ముంబైలో సన్నాహాలు



ముంబై: క్రికెట్ మక్కాగా పేర్గాంచిన ముంబైలో మరో అద్భుతం ఆవిష్కృతం కాబోతోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం రికార్డులను సవాల్ చేస్తూ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో లక్ష మంది సామర్థ్యంతో భారీ అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి ముంబై క్రికెట్ అసోసియేషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియంగా ఉన్న అహ్మదాబాద్ మైదానాన్ని తలదన్నేలా అత్యాధునిక హంగులతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. గత రెండేళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రతిపాదన తాజాగా ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్, సిడ్కో డైరెక్టర్ విజయ్ సింఘాల్‌తో జరిపిన కీలక భేటీతో మళ్లీ పట్టాలెక్కింది.

మహారాష్ట్రకు మకుటం: "ఈ లక్ష సీటింగ్ సామర్థ్యం గల స్టేడియం మహారాష్ట్ర క్రీడా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఇది మన రాష్ట్రానికి దక్కే అసలైన గౌరవం" అని అజింక్యా నాయక్ ధీమా వ్యక్తం చేశారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు కోరుతున్నామని ఎంసీఏ స్పష్టం చేసింది.

## ప్రయోగానికి సిద్ధమైన సాయితేజ్




సుప్రీమ్ హీరో సాయి దుర్గా తేజ్ తన తరువాతి చిత్రం 'ఎస్‌డీటీ19' గురించి అఫీషియల్ క్లారిటీ ఇచ్చాడు. ఈ చిత్రానికి 'క' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శక ద్వయం సుజిత్ మరియు సందీప్ ఎమ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ సోషల్ మీడియాలో మెగా అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చిత్ర యూనిట్ విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది. ఇందులో సాయి దుర్గా తేజ్ దట్టమైన అడవిలో ఆకాశం వైపు చూస్తున్న ఒక యోధుడిలా కనిపిస్తున్నాడు. ఆయన ముందు ఒక రహస్యమైన పర్వతం కనిపిస్తుండటంతో, ఇది ఒక ఫాంటసీ నేపథ్యంలో సాగే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమా సాయి దుర్గా తేజ్ కెరీర్‌లో చాలా స్పెషల్ కానుందని.. ఎందుకంటే ఆయన తన సొంత నిర్మాణ సంస్థ 'విజయదుర్గ ప్రొడక్షన్స్'ను ఈ ప్రాజెక్ట్‌తోనే ప్రారంభిస్తున్నాడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటితో కలిసి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాడు. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సంబంధించిన నటీనటులు మరియు ఇతర టెక్నీషియన్ల వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

## 'భూత్ బంగ్లా'.. మళ్లీ వాయిదా



అక్షయ్ కుమార్ హారర్ కామెడీ సినిమా 'భూత్ బంగ్లా' విడుదలకు సిద్ధంగా ఉంది. దర్శకుడు ప్రియదర్శన్ తీసిన ఈ సినిమా ముందుగా ఏప్రిల్ 10న రావాల్సి ఉండగా, ఇప్పుడు ఏప్రిల్ 17కు వాయిదా పడింది. అయితే సినిమాపై ఉన్న క్రేజ్ దృష్ట్యా ఏప్రిల్ 16 రాత్రి 9 గంటలనుంచే స్పెషల్ షోలు వేయనున్నారు. ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఏ' సర్టిఫికేట్ పొందింది. సినిమా నిడివి 2 గంటల 55 నిమిషాలు. మామూలుగా హారర్ సినిమాలకు ఇంత సమయం ఎక్కువ అనిపించినా, కామెడీ మరియు కథ బాగుంటే ప్రేక్షకులకు బోర్ కొట్టదు. ఇందులో వామిక గబ్బి హీరోయిన్‌గా నటిస్తోంది. టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్‌వంటి పెద్ద నటులు ఇందులో ఉన్నారు. అక్షయ్‌కుమార్ మరియు ఏక్తాకపూర్ కలిసి ఈ సినిమాను నిర్మించారు. ప్రియదర్శన్-అక్షయ్ కాంబినేషన్ కాబట్టి ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.

## మేం స్నేహితుల్లానే ఉంటాం

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్, నటి ఐశ్వర్యారాయ్ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఎన్నిసార్లు ఆ జంట ఈ వార్తలను ఖండించినా.. ఇవి మళ్లీ మళ్లీ ప్రచారం అవుతూనే ఉంటాయి. ఇలాంటి వార్తలపై అభిషేక్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తమ వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగడానికి గల కారణాన్ని తెలియజేశారు. "మా కుటుంబంలో మేమంతా స్నేహితులుగా ఉంటాం. గొప్ప, తక్కువ అనే విషయాలను పట్టించుకోం. మా అమ్మనాన్నలకు పెళ్లి అయినప్పుడు, మా నాన్నకంటే అమ్మే పెద్ద స్టార్. కాబట్టి, అది అసహజమైన విషయమేమీ కాదు. వివాహమనేది ఒక మంచి భాగస్వామ్యానికి సంబంధించింది. నా కెరీర్ మొదలైనప్పటి నుంచే ఐశ్వర్య తెలుసు. నా రెండో సినిమా ఆమెతోనే చేశా. అప్పటి నుంచి మేమిద్దరం మంచి స్నేహితులం. ఇప్పటికీ ఆ స్నేహం ఉంది. పెళ్లి జరిగింది కాబట్టి ఇలా ఉండాలి. అలా చేయాలి అనే చర్చలు మా మధ్య ఎప్పుడూ రాలేదు" అని అభిషేక్ తెలిపారు. గురు, రావణ్, ధూమ్, యువ, పా వంటి చిత్రాల కోసం వీరిద్దరూ కలిసి వర్క్ చేసిన విషయం తెలిసిందే. 2007లో వీరి వివాహం జరిగింది.



## 'సైరాబాను' టైటిల్‌తో ఆది

ఇటీవల 'శంభాల' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నాడు టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్. ప్రస్తుతం ఆయన వైవిధ్యమైన కథాంశాలతోపాటు కమర్షియల్ హంగులున్న చిత్రాలపై దృష్టి సారించాడు. ఈ క్రమంలోనే ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో ఆది తన తరువాతి ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించాడు. ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ హీరోయిన్. చిత్రానికి 'సైరాభాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. మూవీ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన కలర్‌ఫుల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'ఏ ఫన్ ఫిల్డ్ జర్నీ ఆఫ్ లవ్, ఫెయిత్ అండ్ డెస్టినీ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన పోస్టర్‌లో గులాబీ రంగు మేఘాలు, చార్మినార్, వైజాగ్ బీచ్ రోడ్ మరియు రాజమండ్రి గోదావరి బ్రిడ్జ్‌వంటి విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ఇది ఒక అందమైన ఫాంటసీ మరియు రొమాంటిక్ థీమ్‌ను ప్రతిబింబిస్తోంది. హిందూ-ముస్లిం ప్రేమకథ నేపథ్యంలో, కామెడీకి




పెద్దపీట వేస్తూ చిత్రం తెరకెక్కనుంది. ఈ రోజు పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. 'కే ర్యాంప్' వంటి హిట్‌ను అందించిన రాజేష్ దండా, హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, రామ్‌రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

## ఓటీటీకి 'ఎస్.సరస్వతి'



నటి వరలక్ష్మి శరత్‌కుమార్ మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'ఎస్ సరస్వతి'. ఈ సినిమాలో ఆమె ప్రధాన పాత్రలో నటించడమే కాకుండా, దర్శకత్వ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించింది. గతంలో కేవలం 'సరస్వతి' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ చిత్రం మార్చి 6న థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి సాధారణ స్పందనే లభించింది. థియేట్రికల్ రన్ ముగించుకున్న ఈ చిత్రం ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో సందడి చేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా కేవలం తెలుగులో మాత్రమే స్ట్రీమింగ్ అవుతుండగా, భవిష్యత్తులో ఇతర భాషల్లో కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వెండితెరపై ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయిన ఈ చిత్రం, డిజిటల్ వేదికపై ప్రేక్షకులను ఏమేరకు ఆకట్టుకుంటుందో చూడాలి. ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌లో ప్రకాష్‌రాజ్, ప్రియమణి, కిషోర్, రావు రమేష్, జీవా, మురళీ శర్మ మరియు రాధికా శరత్‌కుమార్‌వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో నటించారు. పూజా శరత్‌కుమార్ మరియు వరలక్ష్మి శరత్‌కుమార్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ సంగీతం అందించాడు. ఈ చిత్రం ఓటీటీలో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో ఆసక్తికరంగా మారింది.

## ఓంరౌత్‌తో ప్రాజెక్టుపై హీరో క్లారిటీ

బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్, దర్శకుడు ఓంరౌత్ కాంబినేషన్లో కొత్త ప్రాజెక్ట్ రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీటిపై అజయ్ దేవ్‌గణ్ టీమ్ తాజాగా స్పందించింది. అందులో ఎలాంటి నిజం లేదని పేర్కొంది. "ఒక పోరాట యోధుడి కథతో రూపొందనున్న చిత్రం కోసం అజయ్ దేవ్‌గణ్, ఓంరౌత్ కలిసి వర్క్ చేయనున్నారంటూ జరుగుతున్న ప్రచారం మా దృష్టికి వచ్చింది. ఆ ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. ఆ దర్శకుడితో ఎలాంటి చర్చలు జరగలేదు. వారిద్దరూ వారి వారి ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు. ఇలాంటి వార్తలను ప్రచురించే ముందు మా అధికారిక టీమును సంప్రదించాలి అని అజయ్ టీమ్ సభ్యులు తెలిపారు. అజయ్ ఓంరౌత్ కాంబినేషన్లో గతంలో 'తానాజీ: ది అన్సంగ్ వారియర్' సినిమా తెరకెక్కింది. 2020లో విడుదలైన ఈ చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఈ సినిమా తర్వాత ఓంరౌత్ 'ఆదిపురుష'కు దర్శకత్వం వహించారు. భారీ బడ్జెట్తో సిద్ధమైన ఈసినిమా ఆశించిన ఫలితాన్ని అందించలేదు.

## అందుకే -సైలెంట్‌గా ఉన్నా

వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ-2' గురించి మలయాళనటుడు టొవినో థామస్ స్పందించారు. 2023లో 'ది కేరళ స్టోరీ'విడుదలైనప్పుడు సోషల్మీడియా వేదికగా అసహనం వ్యక్తంచేస్తూ పోస్ట్ పెట్టిన ఆయన..ఈసారి మాత్రం ఎలాంటి కామెంట్ చేయలేదు.'ది కేరళ స్టోరీ-2'పై తాను మౌనంగా ఉండటానికి గల కారణాన్ని తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలియజేశారు. తాను కావాలనే ఏం మాట్లాడాలనుకోలేదని అన్నారు.

"పార్ట్ 1 విడుదలైనప్పుడు ఆ సినిమాపై నా అభిప్రాయాన్ని తెలియజేస్తూ సోషల్మీడియాలో పోస్ట్ పెట్టా.అయితే, ఆ పోస్ట్ కూడా వాళ్లకు ఓ ప్రమోషన్‌గా మారింది. అందుకే ఈసారి ఏవిధంగానూ స్పందించకూడదని గట్టిగానిర్ణయించుకున్నా. అందుకే నేనేమీ మాట్లాడలేదు. కేరళలో దీనిని ఎవరూచూసి ఉండరనుకుంటున్నా" అని టొవినో థామస్ తెలిపారు. మత మార్పిడి అనే అంశంతో'ది కేరళ స్టోరీ' రూపుదిద్దుకొంది. 2023లో ఈ సినిమా విడుదలై అంతటా వివాదాస్పదమైంది.ఆ సమయంలో టొవినో థామస్ ఈ చిత్రం పై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఆ సినిమా నేనింకా చూడలేదు. చూసినవారితోనూ మాట్లాడలేదు. కేవలం ట్రైలర్ చూశా. అందులో 32,000 మంది మహిళలు ఇలా మత మార్పిడివల్ల ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. తర్వాత చిత్రబృందం దీనిని ముగ్గురు మహిళల కథగా చూపించింది. వారి ఉద్దేశం ఏమిటి? నాకు తెలిసినంతవరకూ కేరళలో 35మిలియన్ల మంది ఉన్నారు. ఇలాంటి సంఘటనలు కేరళలో జరగడం లేదని చెప్పను కానీ, ముగ్గురి కథను అందరికీ ఆపాదించి.. మా రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులే ఉన్నా యని చెప్పడం సమంజసం కాదనిపించింది"అని ఆయన పోస్ట్ పెట్టారు. అది అప్పట్లో వైరల్ అయ్యింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన 'ది కేరళ స్టోరీ-2'ఫిబ్రవరిలో విడుదలైంది.కామాఖ్య నారాయణసింగ్ దీనిని తెరకెక్కించారు.ప్రేమపేరుతో అమాయక యువతులను వంచించి మతం ఎలా మారుస్తున్నారు? మాట వినకపోతే వాళ్లను ఎన్నిచిత్రహింసలకు గురిచేస్తారు? అనేది ఇందులో చూపించారు.

